POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మే 2023
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 01

బుద్ధ పూర్ణిమ

(05-05-2023)

ఈ నెల పండుగలు

మే 05 - బుద్ధ పూర్ణిమ
మే 13 - పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన (తిథి - వైశాఖ బహుళ నవమి)
మే 14 - శ్రీ సాయి లీలామృత గ్రంథ కృతజ్ఞతార్చన
మే 20 - శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి జయంతి
మే 26 - అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధన (తిథి - జ్యేష్ఠ శుద్ధ సప్తమి)



'శ్రీ సాయిలీలామృతము'

మహాగ్రంథ కృతజ్ఞతార్చన మహోత్సవము

14TH MAY, 2023

"మామిడి పూతంతా పండ్లవుతాయా?"

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఇహపరశ్రేయస్సుకుప్రతిమనిషికి–సత్సంగమవసరం. కారణం ప్రాకృతిక జీవితంలో మానవ హృదయంలో 'సంగము' (లోలత) చోటు చేసుకొని కర్మ బంధాన్ని కల్గిస్తుంది. మమకారము మొదలుకొని మనము మళ్ళీ మళ్ళీ చేసే పనులన్నీ, ఆలోచనలన్నీ అభ్యాసాలుగా మారుతాయి. మన శరీరము, మనస్సు మరల మరలా ఆ పనులే అట్టి యోచనలే చేయటానికి ఆరాటపడతాయి. గోళ్ళు కొరుక్కోవడం దగ్గరనుండీ, కాఫీ టీల దగ్గరనుండి, చీట్లపేక, గాలికబుర్లు, సాటివారి గురించి ఈర్ష్యాద్వేషాది భావాలతో యోచించడము, మాట్లాడడందాకా అన్నీ మనలో వాటిపట్ల ఏర్పడిన సంగంమీదనే ఆధారపడి అభ్యాసాలవుతాయి. వాటిని మానుకోడానికి ప్రత్యేకమైన యత్నమెంతో అవసరమవుతుంది. సంగము చాలా బలమైనది. అది ఏర్పడడం సులభమేగాని, వాటిని నిర్మూలించడం చాలా కష్టం.

ఎంత కష్టంగా అన్పించే పనైనా పట్టుదలతో కొంతకాలం చేస్తుంటే, అభ్యాసం వలన ప్రీతికరమై చివరికి వదలుకోలేనిదిగా తయారవుతుంది. ఉదాహరణకు కారం పసిపిల్లలకెంత దుర్భరంగా ఉంటుంది? కాని బాల్యంనుండీ తింటూంటే ఒకనాటికి కారం లేకుండా భోజనం గాని, అల్పాహారం గాని తినడమెంతో కష్టంగా వుంటుంది!

ఇంత బలీయమైన సంగం మామూలుగా మనకు ఇంద్రియాల ద్వారా అనుభవమయ్యే విషయాలపట్ల, వాటి వలన మనకు కలిగే సుఖదుఃఖాల పట్లా, అభ్యాసం వల్ల ఏర్పడుతుంది. అలా అది ఏర్పడ్డాక మరల మనము ధ్యానము, సాధన చేయదలచినప్పుడు అమిత బలమైన చాంచల్యంగా ప్రకటమై తొలగించుకోలేని ప్రతిబంధక మవుతుంది. అదెంత బలీయమో తెలియాలంటే -- ఎందరు పూజలు పునస్కారాలు, యాత్రలు మొ॥నవి చేస్తున్నారో, కానీ వారిలో రామకృష్ణ పరమహంస వలే కృతార్థులయ్యే వారెంత కొద్దిమంది? దీనినే శ్రీ కృష్ణుడు భగవద్గీతలో ("మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే" అన్న శ్లోకంలో) యిలా చెబుతాడు – 'కొన్ని వేలమంది మనుష్యులలో ఎవడో ఒకడు ఆత్మజ్ఞానం కోసం నిజంగా ప్రయత్నించేవాడుంటాడు. అలా ప్రయత్నించే వారిలో ఏ ఒక్కరో పూర్ణత్వం చెందుతాడు.' అంటే మనం చూచే అసంఖ్యాకులైన భక్తులు, సాధువులందరూ కృష్ణుని ప్రకారం ముముక్షువులేగారు. ఎక్కువమంది మొదట అదే లక్ష్యంగా సాధన ప్రారంభించినా, మధ్యలో కీర్తి, ధనము, మొదలైన వాటి ప్రాబల్యము వలన పేరుకు మాత్రమే సాధకులుగాను, భక్తులుగానూ మిగులుతారు. కొందరు యితర మతాలకంటే తమ మతమే ఆధిక్యమని నిరూపించడానికి ప్రాకులాడుతూంటే, మరొకరు తాము ఆత్మజ్ఞానం సాధించకనే లోకాలకు గురువులై, వీలైనంతమంది శిష్యులను – చిల్లర చమత్కారాలతోనో, మంత్రోపదేశాలతోనో, ప్రశ్నలతోనో, పూనకాలతోనో – సమకూర్చుకో జూస్తూంటారు. కొందరు విరాగులమని కాషాయం ధరించాక ఆశ్రమాలేర్పరచి వాటికి ఆస్తిపాస్తులు చేకూర్చుకోవడానికిప్రాకులాడుతుంటారు.మరీయింతచేటు

_మిగతా 29వ పేజీలో_

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 మే-2023 సంచిక:01

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	"మామిడి పూతంతా పండ్లవుతాయా?"	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	పరిప్రశ్న	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	05
03.	వారి గొప్పతనం ఎంతని వివరించగలం!	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	06
04.	మాతృదేవి స్మృతులు	శ్రీమతి అరుణ	11
05.	వార్తాలాపము	శ్రీమతి అడిదం వేదవతి	13
06.	శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు	శ్రీమతి శ్రీదేవి	17
07.	మాతృదేవి దివ్యసన్నిధానములో మాస్టరుగారి ఆరాధనోత్సవాలు	శ్రీమతి టి. పద్మావతి	19
08.	ఆశాజ్యోతి	శ్రీ వాసుదేవరావు	21
09.	మరికొందరు భక్తులు	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	23
10.	ద్వారకామాయి అనుభవమండపము	శ్రీమతి రాజ్యలక్ష్మి,	25
11.	ఆచార్యుని అద్భుత లీలలు	శ్రీ జగన్	27

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
www.saibharadwaja.org
www.saimasterforums.org

ఛీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :-సగోత్ర వివాహాలు చేయకూడదా?

- ఒక భక్తురాలు, హైదరాబాదు

జవాబు :-రక్తసంబంధం ఎంత దగ్గరగా ఉంటే అంతమేరకు సంతతికి శారీరకంగాను, మానసికంగాను గూడా క్షేమకరంగాదని నేటి శాస్త్రజ్ఞులు కూడా కనుగొంటున్నారు. రక్తం యొక్క సాన్నిహిత్యానికి కేవలం దగ్గర బంధుత్వమే వుండనక్కరలేదని రక్త హీనులైన రోగులకు క్రొత్త రక్తమెక్కించే విధానం వలన తెలుస్తుంది. సగోత్రీకుల మధ్య అట్టి సాన్నిహిత్యముండి వుండవచ్చు. అంతకంటే గూడ ఋణానుబంధాలను బట్టి ఈ జన్మలో బాంధవ్యాలు ఏర్పడుతాయన్నది సూత్రము. ఆధ్యాత్మిక స్థాయిలో అట్టి సంబంధం ఏర్పరచడం సమంజసంకాని జీవులు సగోత్రీకులయి వుండడం కారణం అయివుండవచ్చు. కేవలం తాత్కాలికంగా ఆడపిల్ల భారాన్ని వదిలించుకునే దృష్టి సరిగాదు. సంస్కారాలన్నీ ఎంతో లోతైన ఆధ్యాత్మిక సూత్రంమీద ఆధారపడ్డాయి. సంస్కారాలలో వివాహమొకటి. “శాస్త్రాలెన్నటికీ అబద్ధాలు కావు” అన్న సాయి మాటలకంటే ప్రమాణమేముంటుంది? జీవిత సమస్యలనుండి తప్పుకునేందుకు దగ్గర దారులు వెదకడం వల్లనే మనిషి అధర్మం చేస్తాడని ఆ కర్మఫలాన్నే అనేక బాధలుగా అనుభవిస్తాడని కొంచెం యోచిస్తే తెలుస్తుంది కదా! ఎవరికి, ఎప్పుడు, ఎవరితో వివాహం జరగాలన్నది ఋణానుబంధంవలన, కర్మ ఫలంగాను, ముందే నిర్ణయమవుతుందని ‘శ్రీ సాయి లీలామృతము’ లెక్కకు మీరిన అనుభవాలతో నిరూపిస్తున్నది. అయినా

శ్రేయస్కరమైన రీతిన సాధ్యమైన మేరకు కర్మఫలాన్ని శ్రీసాయి సర్దుబాటు చేస్తారు. శ్రీ సాయికి మ్రొక్కుకొని, శ్రీ సాయిలీలామృతము పారాయణ చేస్తూ సమస్య తీరేంతవరకు ఇష్టమైన వంటకాన్ని వదులుకొని, నిత్యము సాయికని భోజనానికి ముందు వాకిట్లో మూడు ముద్దలు విడచి మిగిలినది ప్రసాదంగా భుజించమని చెప్పండి. ప్రతి పారాయణ అవగానే శిరిడీకి రూ.2/-లు దక్షిణగా పంపుతూండమనండి. అయితే ఈ సలహా యిచ్చేముందు మీరు నియమంగా ‘శ్రీ సాయిలీలామృతము’, ‘శ్రీ గురు చరిత్ర’ పారాయణ చేయండి. నూటికి తొంభైమందికి సమస్యలు తీరడం నా అనుభవం. ●

(ఏప్రిల్ 2014 సాయిబాబా మాసపత్రిక నుండి)

వారి గొప్పతనం ఎంతని వివరించగలం!

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి నేడు ఆంధ్రదేశములోనే గాక ఇతర ప్రాంతాలలో గూడ ఎంతో మందికి ఎన్నో విధాలుగా తెలుసు. ఆయనవల్ల అనేక విధాలుగా శ్రేయస్సును పొందినవారు ఆయనను తమ శక్తిననుసరించి ఎన్నో విధాలుగా ఆరాధిస్తున్నారు.

కొందరికి ఆయన ఆరాధ్యదైవము. కొందరికి సద్గురువు. మరికొందరికి ఉత్తమ ఉపాధ్యాయులు. మరికొందరికి ఉత్తమ మార్గదర్శకులు. కొందరు ఆయనను తమ తండ్రికంటే గూడ మిన్నగా భావిస్తే, మరికొందరు తల్లీ, తండ్రి, గురువు, దైవము - అన్నీ ఆయనేనని ఆరాధిస్తున్నారు.

ఇంతకూ ఆయనను ఇంతమంది ఇంతగా ఆరాధిస్తున్నందుకు కారణమేమిటి? అసలు ఆయన తత్వమేమిటి? ఆయన ఈ ప్రపంచానికి చేసిన శ్రేయస్సేమిటి? ఆయన బోధించిన తత్వమేమిటి? ఆయన గురించిన ఈ విషయాలు ఎంతో మందికి తెలిసి వుండవచ్చు. కానీ ఎవరి సంస్కారాన్ననుసరించి, ఎవరి మానసిక స్థాయిని అనుసరించి వారివారికి ఆయన అనేక విధాలుగా అర్థమౌతారు. అందుకని ఆయన గురించి మరొక్కసారి అవే విషయాలైనా స్మరించుకోవడంలో తప్పేమీ లేదు. మహాత్ముల స్మరణ నిరంతరం చేసుకోవడమే శ్రేయస్సుకు ఉత్తమ మార్గమని పెద్దలు చెప్పివున్నారు. కనుక ఈ కృతజ్ఞతారాధనా మహోత్సవం సందర్భంగా ఆయన గురించి క్లుప్తంగా స్మరించుకుందాము.

మహాత్ముల జీవితాలు ప్రత్యేకంగా ఉంటాయనడంలో సందేహమేమీలేదు. అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితము కూడా ఎంతో విశిష్టమైనది.

ఆయన నిత్యాన్వేషి. నిత్యాన్వేషి అనడానికి కారణము – జీవితంలో ఎప్పుడో అన్వేషణ చేయడముగాక ఊహ తెలియని వయసు నుంచే ఆయన అన్వేషకుడుగా వుండడమే. 4సం॥ల పిల్లవాడుగా వున్నప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి మాతృదేవత మరణించారు. ఆమె అకస్మాత్తుగా అదృశ్యమవడంతో కనిపించని అమ్మకోసం ఆయనలో తీవ్ర అన్వేషణ ప్రారంభమైంది. నిరంతరమూ అమ్మకోసం అన్వేషణే. అయినా అమ్మ రాదు. కనిపించదు. ఇంట్లో వాళ్ళు చెప్పినట్లు గుఱ్ఱపుబండిలో షికారుకు వెళ్ళిన అమ్మ ఎంతకూ రాదేమిటి? ఈ గుఱ్ఱపు బండిలోనైనా వస్తుందా? అని వీధినపోయే ప్రతి గుఱ్ఱపు బండినీ పరిశీలించడము, అమ్మ కోసం అన్వేషించడమూ చేస్తూ వుండేవారు. చాలాకాలం ఇదే ఆయన అన్వేషణ. తర్వాత ఎవరో అమ్మ మరణించిందని, మరణించినవారు తిరిగి ఇకరారు అని ఆయనకు తెలియజేశారు. అప్పటి నుంచీ అన్వేషణ మలుపు తిరిగింది. "అసలు మరణించడమంటే ఏమిటి? మరణించినవారు ఏమవుతారు? ఎందుకు తిరిగిరారు? దానిని తెలుసుకోవడమెలా? అని ఆ చిన్ని హృదయంలో మరణం గురించి తెలుసుకోవడానికి అన్వేషణ మొదలైంది.

తర్వాత కొంతకాలానికి ఒక పక్షి మరణించడం చూడడము సంభవించింది. ఆ పక్షి మామూలుగా నిద్రపోతున్నట్లుగానే వుంది కదా! మరి ఎందుకు మరణించినదని అంటున్నారు?" అని ప్రశ్నిస్తే అది నిద్రపోవడం కాదు, అది కదలదు, లేవదు' అని చెప్పారు. "అయితే మరణించినదేమిటి? శరీరం అలాగే వున్నది

కదా!" అనేది మరో ప్రశ్న. దాని ప్రాణం శరీరంలో నుంచి పోయింది' అని సమాధానం చెప్పారు. అప్పటి నుంచి ప్రాణమంటే ఏమిటని ఎవరిని ప్రశ్నించినా, ఎవరూ సరిగ్గా చెప్పలేక పోయారు. దాంతో ఆయనలో అంతర్గతంగా ఆ ప్రశ్న అలాగే వుండిపోయింది.

తర్వాత ఆయన పెరుగుతున్న కొద్దీ ఆయనలోవున్న అన్వేషణ కూడా పెరుగుతూ వచ్చింది. ప్రతి విషయము గురించీ ఇది ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్న ఉద్భవించడము, దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలనే ప్రయత్నము, అన్వేషణ పెరుగుతూ వచ్చాయి. ప్రతి విషయము గురించీ మూలమైన ప్రశ్నవేయడం ప్రారంభమైంది. తండ్రిగారి వద్దకు వచ్చే మహాపండితుల దగ్గరనుంచీ సాటి బాలుర దాకా ఆయన ఎవ్వరినీ విడిచిపెట్టేవారు కాదు. పండితులను భారత, రామాయణాల గూర్చిన మూలమైన ప్రశ్నలు వేస్తే, సాటి పిల్లలు చేసే అల్లరి చేష్టల గురించి ఎందుకలా చేయాలనిపిస్తుంది? దానివలన లాభమేమిటి?' అని నిలదీసేవారు. ఆయన ప్రశ్నలకు అందరూ తలక్రిందులవ్వవలసినదే! ఉపనయనం చేసుకోమన్న తండ్రిగారిని సైతమూ ఆయన విడిచిపెట్టలేదు. ఎందుకు ఉపనయనం చేసుకోవాలో చెప్పమని నిలదీశారు. అలాగే భోజనము చేసేటప్పుడు కాకబలికి పెట్టే అన్నపుముద్దను గూర్చి కూడా నిర్భయంగా ప్రశ్నించారు.

అలాగే ప్రతివిషయము గూర్చి అంటే, మానసిక తత్వము, శారీరక తత్వము, ప్రపంచ పోకడలు అన్నింటి గురించి తనను, బయటివారినీ గమనిస్తూ ఎన్నో విషయాలను క్షుణ్ణంగా ఆలోచించి తెలుసుకున్నారు.

ఆ తర్వాత 16సం॥ల ప్రాయంలో ఉపనయన క్రతువులో ఏముందో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో ఉపనయనము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే సరిగ్గా ఉపనయన క్రతువులోని మంత్రోపదేశ సమయంలో తనకు ప్రియాతి ప్రియమైన అన్నకుమారుడు మరణించడంతో మళ్ళీ మరణము గూర్చిన జిజ్ఞాస మేల్కొన్నది. ఎలాగైనా ఆ విషయం తెలుసుకోవాలనే పట్టుదలతో అన్వేషణ ప్రారంభించారు. సుమారు 6,7 సం॥ల తీవ్ర అన్వేషణ తర్వాత ఒక శూన్యస్థితి కలగడంతో ప్రశాంతత చేకూరింది. ఆ తర్వాత 1963 సం॥లో శిరిడి సాయినాథుని దర్శనముతో ఆయనకు ఆత్మానుభూతి కలిగింది. అంతటితో సృష్టిని గూర్చిన తత్వమంతా ఆయనకు అవగతమైంది.

అయినప్పటికీ ఆయన అన్వేషణ పూర్తిగా లేదు. అప్పటినుంచి అన్వేషణ మరో మలుపు తిరిగింది. అంతటి అనుభూతిని ప్రసాదించిన శిరిడి సాయినాథుని గురించిన అన్వేషణ ప్రారంభమైంది. అంతేకాదు, "అటువంటి మహాత్ములు ఇంకా ఎవరైనా వున్నారా? ఉంటే ఎలా వుంటారు? వారి తత్వమేమిటి? బోధలేమిటి?" అనే అంశాల గురించి అన్వేషణ ప్రారంభమై ఎంతోమంది మహాత్ములను దర్శించడము, మరెంతో మంది మహాత్ముల చరిత్రలు చదవడమూ జరిగింది.

ఆ తర్వాత ఆధ్యాత్మికతకూ, విజ్ఞానశాస్త్రానికి గల సంబంధాన్ని గూర్చి తెలుసుకోవడానికి ఆయన ఎన్నో వైజ్ఞానిక సంబంధమైన విషయాలను తెలుసుకున్నారు.

ఇంతవరకూ మనము చెప్పుకున్నదానిని బట్టి 'ఆయన ప్రపంచమే వేరు' అనిపించవచ్చు. అలా అనుకుంటే మాత్రం మనము పప్పులో కాలేసినట్లే. అక్కడే ఆయన ప్రత్యేకత ఇమిడి వున్నది. ఆయన దృష్టిలో ఆధ్యాత్మికత, లౌకికత వేరుకాదు. అందుకే ఆయన ఈ సమాజంలోని అన్ని విషయాలను గూర్చి క్షుణ్ణంగా అన్వేషించి తెలుసుకున్నారు. ఎన్నో పరిష్కార మార్గాలను తెలియజేశారు. ఈ ప్రపంచానికి శ్రేయస్సు చేకూర్చడానికి కొత్తకొత్త మార్గాలను జీవితాంతమూ అన్వేషిస్తూనే ఉన్నారు. ఉదాహరణకు పసిపిల్లల పెంపకము దగ్గరనుంచీ ప్రపంచ విస్ఫోటనకు కారణమయ్యే అణుబాంబులను ఉపయోగించవలసిన మార్గాలను గురించి ఆలోచించి, అన్వేషించి తెలియచెప్పారు. అంతటి ఆయన వ్యక్తిత్వము గూర్చిన కొన్ని విషయాలను గురించి యిప్పుడు చెప్పుకుందాము.

పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రేమస్వరూపులు

ప్రేమ శాశ్వతమైనది. అనంతమైనది. మమకారము సమసిపోతుంది. ఆయనకు తన తల్లి మీద వున్నది మమకారము కాదు, ప్రేమ మాత్రమే. అందుకనే అది మరుగున పడిపోలేదు. అంతరాంతరాలలో ప్రజ్వరిల్లుతూనే వున్నది. అలాగే అన్నగారి కుమారుని పట్ల కూడా ఆయనకు అట్టి ప్రేమ వుండడంతో అది మరింత విజృంభించి అనంత ప్రేమకు దారితీసింది. అప్పటినుంచీ ఆయనకు తన తల్లి, అన్న కుమారుని పట్ల ప్రేమ మాత్రమేగాక సృష్టిలోని ప్రతి ప్రాణిపట్ల ప్రేమభావం పెల్లుబికింది. అందుకే ఆయన ఒక్క మరణం పట్ల మాత్రమేగాక, సృష్టిలోని సకల జీవులకూ దుఃఖకారణములైన అనేక విషయాలపట్ల పరిష్కార మార్గాలను అన్వేషించనారంభించారు.

ఆయన వద్దకు వచ్చినవారిపట్ల ఆయన ప్రేమ అనంతముగా ప్రస్ఫుటమౌతూ వుండేది. ఆయన వద్దకు వచ్చినవారు ఆ ప్రేమ స్వరూపాన్ని, ఆయన యొక్క ప్రేమతత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించి ఆయనను మరచిపోలేకపోయేవారు. తమ హృదయాలలో శాశ్వతంగా ఆయనను ప్రతిష్టించుకునేవారు. ఆయనకు ప్రతిజీవిపట్ల అంతులేని ప్రేమయే. ఆ జీవులకున్న శారీరక, మానసిక, సాంఘిక సమస్యలపట్ల విపరీతమైన జాలి, కరుణ. అందుకే ఆయన వారి సమస్యలను తన సమస్యలుగానే భావించేవారు. అత్యంత కరుణతో వాటికి పరిష్కార మార్గాలను ఎన్నింటినో తెలియజేసేవారు.

ఆయన పలకరింపు అత్యంత వాత్సల్యంతో నిండివుండేది. ఆడవారిని 'అమ్మా' అని, 'అమ్మాయ్!' అనీ ఆయన సంబోధించేవారు. యువకులను 'ఏమోయ్!' అంటూ అతి చనువుగా పిలిచేవారు. తమను అలా పిలుస్తుంటే ప్రతివారూ ఆ ప్రేమ పూరితమైన పలకరింపుకు ఆయన వద్ద తమ తండ్రిని మించిన ప్రేమను అనుభవించేవారు.

ఏసుక్రీస్తు, బుద్ధునివలె ఆయనకు తనది, తన సమయం అంటూ ఏమీలేక జీవితమంతా సాటిజీవుల శ్రేయస్సు కొరకే పాటుపడ్డారు, కృషి చేశారు పూజ్యశ్రీ మాస్టరుగారు. అందుకనే ఈ రోజు ఆయనను బోధల ద్వారాగానీ, రచనల ద్వారాగానీ, స్మృతుల ద్వారా గానీ తెలుసుకున్నవారు కూడా ఆయనను అనన్య భక్తి భావంతో ఆరాధిస్తున్నారు.

ఇక ప్రత్యక్ష సాన్నిధ్యము, సాంగత్యము, దర్శనము, స్పర్శనము కలిగిన వారి సంగతి చెప్పవలసినదేమున్నది? అది అనుభవించి తీరవలసినదే! స్మరించి తరించవలసినదే!!

పూజ్యశ్రీ మాస్టరుగారి ఉపదేశాత్మకత

పూజ్యశ్రీ మాస్టరుగారి ఉపదేశాత్మకత ఎంతో ప్రత్యేకంగా వుండేది. ఆయన చిన్న విషయాల దగ్గరనుంచీ పెద్ద విషయాల దాకా ఇది ఇలా చేయవలసినదేనని బలవంతపరచేవారు కాదు. కనీసం గట్టిగా కూడా చెప్పేవారు కాదు. సూచనగా మాత్రమే తెలియజేసేవారు. ఆయన చెప్పిన ప్రతిదీ ఆయన ఆచరించి చూపారు. అలా చెప్పని వాటినెన్నింటినో ఆయన ఆచరణ ద్వారా తెలియజేశారు. ఆయన ఆచరణ ద్వారా మనం తెలుసుకోవలసిన విషయాలు అన్ని వున్నాయా! అని మనకు అనిపిస్తుంది.

ఒకటే సూత్రం అన్ని విషయాలలోనూ, అందరిపట్ల, అన్ని పరిస్థితులలోనూ పనిచేయదని ఆయన తెలియజేశారు. అందుకే ఆయన అందరికీ ఏ విషయమైనా ఒకేరకంగా చెప్పేవారు కాదు. ఉదాహరణకు అనవసరపు విషయాలను ఎక్కువగా మాట్లాడేవారిని చాలా తక్కువగా మాట్లాడడం మంచిదనీ, అవసరమైనంతవరకే మాట్లాడమని బోధించారు. అలాగే చాలా ముభావంగా వున్నవారిని నలుగురితో మాట్లాడడం నేర్చుకోమనేవారు. అలాగే పని బద్ధకస్థులకు పనులు చేస్తూ వుండమనీ, ఎప్పుడూ పనిలోనే నిమగ్నమయ్యే వారిని వేరే విషయాల మీద ధ్యాస నిలుపమనీ చెప్పేవారు. అలాగే దుబారాగా ఖర్చు పెట్టేవారిని పొదుపుగా ఖర్చు చేయడం మంచిదని చెప్పేవారు. అలాగే పిసినారితనంతో వున్నవారితో డబ్బు ఖర్చుపెట్టడం మంచిదనేవారు.

ఏ విషయమైనా ఎందుకు చేయాలి? ఎలా చేయాలి? ఎప్పుడు చేయాలి? ఎవరు చేయాలి? ఎవరికి చేయాలి? అని వివేకంతో ఆలోచించాలి. అలా ఆలోచించి చేసినప్పుడు మాత్రమే సక్రమంగా ఏదైనా చేయడం జరుగుతుందని ఆయన చెప్పేవారు. ఎవరికైనా వారివారి పరిస్థితులను బట్టి, అప్పటి వారి మానసిక స్థితిని బట్టి, వారి సంస్కారాన్ని బట్టీ ఆలోచించి ప్రవర్తించినప్పుడే సరైన ఫలితం వస్తుందని ఆయన చెప్పేవారు. ఒకరి పరిస్థితులుగాని, మానసిక స్థితులుగాని, సంస్కారాలుగాని ఇతరులు పూర్తిగా అర్థం చేసుకోవడానికి అవకాశం, మానసిక స్థాయి వుండదు. కనుక వారి వారి పరిస్థితులను బట్టి పెద్దలు చెప్పిన సూత్రాలను ఉపయోగించుకుంటూ పాటించాలని ఆయన చెప్పేవారు. పెద్దలు సూత్రాలను మాత్రమే చెప్పగలరు. వాటిని పరిస్థితులను బట్టి అన్వయించుకోవలసినది మనమేనని ఆయన బోధించేవారు. ప్రతి విషయాన్నీ ఆయన చిన్న చిన్న ఉదాహరణలతో చెబుతూ వుండేవారు. ఉదాహరణకు, 'అసత్యమాడకూడదు' అన్నది పెద్దల సూక్తి. అది ప్రధాన కర్తవ్యంగా భావించవలసినదేగాని, కొన్ని కొన్ని స్థితులలో, కొన్ని పరిస్థితులలో దానిని జవదాటవలసి వస్తుంది. ఉదా॥ పసిపిల్లవాడు తనకు ఆరోగ్యానికి సరిపడని పదార్థం తింటానని పట్టుబట్టినప్పుడు అది లేదని చెప్పడం సత్యాన్ని ఉల్లంఘించడం కాదని చెప్పేవారు. ఇందుకు పురాణాలలో కూడా ఎన్నో ఉదాహరణలు వున్నాయని కూడా ఆయన చెప్పేవారు.

అలాగే ఎన్నో విషయాలలో ఆయన చక్కని సమన్వయాన్ని వివరిస్తూ బోధించేవారు.

'ఎవరికి తగిన ఉపదేశం వారికి ఇవ్వగలడమే సద్గురువు

యొక్క ప్రత్యేకత' అని ఆయన చెప్పినట్లు ఆయన ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మికతలోగాని, లౌకికతలోగానీ వారివారికి తగిన ఉపదేశాలను ఇచ్చేవారు.

'సంస్కారాలను సరియైన విధంగా దిద్దుకోవడమే సాధన' అని ఆయన నొక్కి వక్కాణించారు. సంస్కారాలను సరైన విధంగా మలచుకొంటూ ఐహికతలోగాని, ఆధ్యాత్మికతలో గానీ సరైన విధంగా ప్రవర్తించడమే సాధనని ఆయన స్పష్టం చేశారు.

భార్యాబిడ్డలపట్లగానీ, తల్లిదండ్రులపట్లగానీ, బంధువులపట్ల గానీ, మిత్రుల, సన్నిహితుల పట్లగానీ, సాటి మానవులపట్లగానీ, ఇతర ప్రాణుల అంటే పశుపక్ష్యాదుల పట్ల మాత్రమేగాక వృక్షములు మొ॥న వాటిపట్ల కూడా - ఇంకా లోతుగా చూస్తే, జడపదార్థాలైన రాయిరప్పలపట్ల కూడా ఆయన చూపించే శ్రద్ధ మాటలలో చెప్పనలవికాదు, చూసి తీరవలసినదే.

అన్ని విషయాలలోనూ ఆయన ప్రవర్తనను గూర్చి వివరించాలంటే ఒక ఉద్గ్రంథం అవుతుంది. అయితే ఇది ఆయనను గూర్చిన చిన్న వ్యాసమే గనుక ఇంతకంటే చెప్ప సాధ్యము కాదు. ఇప్పటివరకు ఆయనను గూర్చి కొందరు వ్రాసిన కొన్ని వ్యాసాలతో ఆయన గూర్చి చాలా స్వల్పంగా తెలుసుకోవడానికి ఆవకాశముంది. ఎంత స్వల్పంగా తెలుసుకున్నప్పటికీ అదే మనకు, మన జీవితానికి పెద్ద ఉపదేశంగా పరిణమించవచ్చు అందుకని ఆయన సూక్తులు, బోధలు తరచి తరచి తెలుసుకోవలసిందే. ఆచరించవలసినదే! అప్పుడే మన జీవితాలకు సరైన మార్గము, బోధ లభిస్తాయి.

దివ్యపురుషుడు

పూజ్యశ్రీ మాస్టరుగారు స్ఫురద్రూపి. చిన్నప్పుడు ఆయన తెల్లగా, పచ్చని పసిమి ఛాయతో, చక్కని గిరజాల జుట్టుతో, బొద్దుగా ముద్దుగా ఉండేవారట. వయసు పెరుగుతున్న కొద్దీ ఆయన రూపం అత్యంత మనోహరంగా పరిణమిస్తూ వచ్చింది. అయితే అంతకంటే అందంగా వున్నవాళ్ళు ఎందరో వుండి వుండవచ్చు. కానీ ఆయనది సామాన్యమైన అందంగాక ఏదో ఆకర్షణ ఆయనలో ప్రభవిల్లుతూ వుండేది. ఆనాడు అది అలౌకిక దివ్యవర్చస్సు అని అప్పటివారు గుర్తించకపోయివుండవచ్చు. కానీ వారంతా అలౌకిక ఆనందంలో మునిగి తేలారన్నది మాత్రం ఆయనను చిన్నప్పటినుంచీ చూసిన, ఎత్తుకుని ముద్దాడిన, స్నేహం చేసిన, పరిచయం వున్నవారి యొక్క స్పష్టమైన అవగాహన అని వారు చెబుతున్న మాటలను బట్టి తెలుస్తుంది. ఆయనతో ఏ విధమైన పరిచయం వున్నవారైనా అట్టి దివ్యానందంలో ఉండేవారన్నది కొందరు స్పష్టంగా తెలియజేశారు కూడా.

మామూలుగా చూస్తే 1963వ సంవత్సరంలో బాబా పరిచయమైనప్పటినుంచీ మాత్రమే ఆయన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమైనట్లు మనకు అనిపిస్తుంది. మరి ఈ లోపల ఆయనలో దివ్యత్వం ఉండడమేమిటి? ఇది మామూలుగా అర్థంగాని విషయం. కానీ నిశితంగా ఆలోచిస్తే ఆయనలో దివ్యత్వం పుట్టినప్పటినుండే ఇమిడివుంది. ఈనాడు ఆయన దివ్యపురుషుడిగా అందరిచేత ఆరాధించబడటానికి కారణం ఆ దివ్యత్వమే.

అయితే, ఆయనలో అప్పుడువున్న దివ్యత్వమేమిటి? అసలు దివ్యత్వమంటే ఆధ్యాత్మిక ప్రవచనాలు గానీ, మహిమలు గానీ మాత్రమే కావు. దివ్యగుణాలు ఎవరికైతే సహజంగా వుంటాయో అదే వారిలోని దివ్యత్వం. అట్టి గుణాలు పూజ్యశ్రీ మాస్టరుగారిలో బాల్యంనుంచే ప్రకటమౌతూ వచ్చాయి. అందుకనే ఆయన అల్లరి చేష్టలు, ఆయన చర్యలు, ఆయన మాటలు - అన్నీ అందరినీ ప్రభావితం చేసేవి.

ఆయనకు చిన్నప్పుడు తల్లి పట్ల ప్రగాఢమైన ప్రేమ వుండేది. అంతేగాక తండ్రిగారి పట్ల కూడా ఎంతో ప్రేమ వ్యక్తమౌతూవుండేది. ఐదారేండ్ల వయస్సులో వున్నప్పుడు కూడా పితృదేవులను ఎవ్వరైనా - చివరకు ఆయన స్నేహితులైనా సరే 'ఏరా అనంతం....' అనడాన్ని కూడా ఆయన సహించేవారు కాదు. పెద్దయిన తర్వాత కూడా తండ్రిగారి పట్ల వినమ్రత, ప్రేమభావం ప్రకటమౌతూనే వుండేవి. ఆయన తండ్రిగారిని "నాన్నా!" అని పిలుస్తుంటే ఆ పిలుపు ఆయన హృదయాంతరాలలోంచి ప్రేమతో పెల్లుబికి వస్తున్నట్లు అనిపించేది. తండిగారి పట్ల ఆయన అన్ని విషయాలలోనూ ఎంతో శ్రద్ధ వహించేవారు. ఎన్నో విషయాలు ఆయనతో మాట్లాడేవారు, చర్చించేవారు. ఒక స్నేహితునివలె సలహా ఇచ్చేవారు. ఉదాహరణకు ఆయనకు 78 ఏళ్ళ వయసులో విదేశాలకు రమ్మని పిలుపు వచ్చినప్పుడు ఆయన శారీరక పరిస్థితిని బట్టి ఆ వయస్సులో వెళ్ళడం సమంజసం కాదని ఆయన నిర్భయంగా సలహా ఇచ్చారు. శ్రీమాన్ అనంతాచార్యులవారికి విదేశాలకు వెళ్ళాలని ఎంతగా అనిపించినా పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సహేతుకమైన కారణాల వలన వారి మాటనే అంగీకరించారు. అందుకే

ఒకసారి ఆయనను "మీ నలుగురి పిల్లల్లో ఎవరంటే మీకెక్కువ ఇష్టం?" అని అడిగినప్పుడు ఆయన, "నాకు నలుగురూ ఇష్టమేగాని భరద్వాజ నాకు స్నేహితునివలె అనిపిస్తాడు. అందుకని భరద్వాజ అంటే నాకు ఎక్కువ ఇష్టం" అని చెప్పారట. ఇటువంటి ప్రేమ ఒక తండ్రిగారి పట్ల మాత్రమే కాదు, అందరి పట్ల ఆయనకు అలాగే వుండేది. ప్రతి చిన్న విషయంలోనూ అవతలివారికి సాధ్యమైనంత శ్రేయస్సు చేకూర్చాలన్న తపన ఆయనలో ప్రస్ఫుటమౌతూ వుండేది.

అధర్మాన్ని ఎదుర్కోవడంలో ఆయనకు ఉన్న ధైర్యం చెప్పనలవికాదు. పదేండ్ల వయసులో బోధాయన గారిని కొంతమంది యువకులు ఎదుర్కొన్నప్పుడు ఆ సంగతి తెలిసి యువకులైన పదిమందిని బాల భరద్వాజులు ధైర్యసాహసాలతో ఎదుర్కొని వాళ్ళను చిత్తుగా ఓడించడమే గాక, ఇటువంటి పని ఇకముందు ఎప్పుడైనా చేస్తే సహించబోనని బెదిరించి పంపించారు.

అలాగే విహారయాత్రకు ఆడపిల్లలతో కలిసి వెళుతున్న సాటి స్నేహితులతో అది సబబు కాదని నిర్భయంగా చెప్పారు.

తాము పనిచేస్తున్న విద్యాసంస్థలలో జరుగుతున్న అన్యాయాలను గూర్చి సంస్థానాధికారులతో ధైర్యంగా పోరాడేవారు. అందుకని సాటి అధ్యాపకులు ఈయననే అందుకు ఎన్నుకునేవారు.

అంతేకాక ఆధ్యాత్మికతలో జరుగుతున్న అక్రమాలను గూర్చి సాధ్యమైనంతగా ప్రజలకు తెలియజెప్పాలని ప్రయత్నించారు. భగవంతుడు లేడన్న నాస్తికులను, హేతువాదులనూ సహేతుకంగా ఎదుర్కొన్నారు.

ఇలాగే ఎన్నో దివ్యగుణాలు ఆయనలో వున్నాయి. గనుక ఆయన దివ్యపురుషుడని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

గురుభక్తి

పూజ్యశ్రీ మాస్టరుగారికి తమ గురువైన సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని పట్ల వున్న భక్తి విశ్వాసాలు అపారం. శిరిడీ సాయినాథులు ఆయనను తమ చెంతకు చేర్చుకున్నప్పటినుంచీ గురువు యొక్క స్మరణే తమ శ్వాసగా చేసుకున్నారు. నిరంతరమూ లీలా చింతన, తత్వచింతనలో తమ కాలమంతా నింపుకున్నారు. జీవితంలో జరిగిన ప్రతి సంఘటననూ ఆయన ఆదేశంగానూ, ప్రసాదంగానూ భావించారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన తమ గురువుపట్ల విశ్వాసం సడలించలేదు. గురుతత్వాన్ని, బోధలను ప్రపంచానికి తెలియజేస్తూ నిరంతర సాధకుడిగా జీవించారు. ఎవరి పొగడ్తలకూ ఆయన పొంగిపోలేదు, తెగడ్తలకు కృంగిపోలేదు. "ఇవేవీ శాశ్వతం కావు. నా గురువు మెచ్చే రీతిన నేను ప్రవర్తించడమే నాకు కావలసినది" అని ఆయన స్పష్టంగా చెపేవారు. అందుకే "శిష్యుడైనవాడు నాకు ఒక్కడు కూడా లభించలేదు" అని చెప్పిన సమర్థ సద్గురుడైన శ్రీసాయినాథుడు "నీకు గురువు లేడని బాధపడతావెందుకు? నేనున్నాను కదా" అని ముమ్మారు పూజ్యశ్రీ మాస్టరుగారితో స్వప్నంలో చెప్పారు. అంటే ఆయనే స్వయంగా పూజ్యశ్రీ మాస్టరుగారిని తమ శిష్యులుగా ఎంచుకున్నట్లే కదా. ఇంతకు మించి పూజ్యశ్రీ మాస్టరుగారి గొప్పదనం గురించి చెప్పుకోవలసినది ఇంకేమైనా వున్నదా?

పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ఆలోచిస్తూ వుంటే ఆయన ఎన్నో కోణాలలోంచి ధర్మబద్ధమైన, సాంప్రదాయబద్ధమైన, నిర్దుష్టమైన, నిత్యసత్యమైన, మహోన్నతమైన అవతారపురుషుడిలా దర్శనమిస్తారు. ***ఇన్ని కోణాలలోను పరిపూర్ణత కనబరిచే వారి గొప్పతనాన్ని ఎంతని వివరించగలం?*** నేటి సమాజానికి ఆయన జీవిత విశేషాలు, చర్యలు, బోధలు అత్యంత ప్రయోజనకరములు, శ్రేయస్కరములు. కనుక సాధ్యమైనంత త్వరగా సాయిమాస్టర్ భక్తులందరూ మేల్కొని ఆయనను అనుసరించవలసిన అవసరము ఉన్నది. అలా చేయకుంటే నేటి సమాజమేగాక భావితరాలవారు కూడా ఎంతో పతనమయ్యే ప్రమాదం పొంచి వున్నది. కనుక ***పూజ్యశ్రీ మాస్టరుగారి బిడ్డలైనవారందరూ కలిసి కూర్చుని ఆలోచించి ఒక నిర్దుష్టమైన సాంప్రదాయాన్ని తీసుకురావలసిన అవసరమున్నది.*** అట్టి దీక్షను పూనడానికి సంసిద్ధులమయ్యేందుకు అవసరమైన శక్తిని ప్రసాదించమని శిరిడీ సాయినాథుని, పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రార్థిద్దాము. వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు అనుగ్రహించమనీ, వారిని మన వెంటవుండి సక్రమమైన మార్గంలో నడిపించమనీ ఈ కృతజ్ఞతారాధన సందర్భంగా భక్తి వినమ్రతలతో హృదయ పూర్వకంగా ప్రార్థిద్దాము. ●

మాతృదేవి స్మృతులు

శ్రీమతి అరుణ

నా తోలు సత్సంగ సభ్యురాలైన శ్రీమతి అరుణగారు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి తో తన అనుభూతుల్ని, అనుభవాల్ని, శ్రీ అమ్మగారి లీలలను యీ విధంగా పంచుకుంటున్నారు:

నేను BSNL లో ఉద్యోగం చేసేదాన్ని. మా ఆఫీసుకి శ్రీ ప్రసాదుగారు (చిట్టిబాబు గారు) వస్తుండేవారు. వారిద్వారా పూజ్యశ్రీ అమ్మగారి గురించి తెలిసింది. అప్పటికే నేను పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేసేదాన్ని. పూజ్యశ్రీ అమ్మగారు ఫోన్ నెంబరు ప్రసాదుగారే యిచ్చారు. మొట్టమొదటిసారి ఆఫీసు నించి ఫోన్ చేసి మాట్లాడాను. బహుశా అది 1998 వ సంవత్సరం.

పూజ్యశ్రీ అమ్మగారు, ఒకరోజు స్వప్నదర్శనం యిచ్చారు. కలలో అప్పుడే ఏదో ఫంక్షన్ అయినట్లుగా వుంది. జనం అంతా హడావిడిగా వున్నారు. నేను పూజ్యశ్రీ అమ్మగారిని వెదుక్కుంటూ, ఆ ఇంట్లోకి వెళ్లాను. అక్కడ వారు ఒక గదిలో పడుకుని వున్నారు. నేను వెళ్లి నమస్కారం చేసుకున్నాను. అమ్మగారు వెంటనే చెయ్యి చాపి, “నా చేతిలో చెయ్యి వెయ్యి” అన్నారు. నేను చెయ్యి వేసాను. “ఎప్పుడూ బాబా మార్గాన్ని వదలనని మాట యివ్వు” అన్నారు. ‘సరే’ నని చెప్పాను. తరువాత పూజ్యశ్రీ అమ్మగారు యెంత సర్వజ్ఞులో నాకు అర్థం అయ్యింది. ఎందుకంటే, నా సంసారిక జీవితం చాలా సమస్యలతో వుండేది. మావారు ECIL లో జాబ్ చేసేవారు. మాకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. పూజ్యశ్రీ అమ్మగారు తీసుకున్న ఆ మాటే నన్ను యింతవరకు కాపాడింది.

2001 ఏప్రిల్ 10వ తేదీ చిక్కడపల్లిలో ప్రథమంగా పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకున్నాను. అప్పటినించి అప్పుడప్పుడూ ఆఫీసు నించి నేరుగా దర్శనానికి వెళ్లి అటు నుంచి ఇంటికి చేరుకునేదాన్ని. అప్పటికి నేనున్న సమస్యలలో, నాకు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చాలా ఉపశమనంగా వుండేది. కొన్నిరోజులకి పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరికి వచ్చారు. మేముండే ప్రాంతానికి దగ్గరే అయినా, దర్శనం వేళలు మారే సరికి, నేను ఇంటికి చేరుకునేసరికి కొద్దిగా ఆలస్యమయ్యేది. దాంతో ఇంట్లో అందరూ కోప్పడేవారు. మావారికి నేను బాబాని పూజించడం యిష్టం వుండేది కాదు. కానీ బాబా దయవల్ల, మా ఇంటి పక్కనున్న బాబా గుడికి ప్రతిరోజూ భోజన నివేదన పంపించేదాన్ని. ఇలా 12సం॥లు జరిగింది. నాలుగు హారతులు చేసుకునేదాన్ని. ఆ పుణ్యమే నన్ను పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి చేర్చిందని భావిస్తున్నాను.

ఒక రోజు మా అమ్మాయి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వచ్చి, నా మీద కంప్లైంట్ యిచ్చింది. రోజంతా ఉద్యోగం, అదయ్యాక యిక్కడకి వచ్చి యిటునుంచి ఇంటికి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతోంది అంటూ ఏదేదో చెప్పింది. పూజ్యశ్రీ అమ్మగారు వెంటనే “రేపటి నించి మీ అమ్మ యిటురాదు లేమ్మా!” అన్నారు. నా వైపుచూసి, “పిల్లలని చూసుకోవడమే ముఖ్యం, నా దగ్గరికి రావడం కంటే” అని చెప్పారు. నాకు గుండె గుభేల్ మంది, అమ్మగారు నాకు ఇంత

పెద్దశిక్ష వేసారేమిటా? అని! కానీ కాలాంతరంలో, మా అమ్మాయే పూజ్యశ్రీ అమ్మగారిని చూడకుండా వుండలేకపోయేది. తరవాత మేమిద్దరం కలసివస్తుంటే, ఈసారి మా అబ్బాయి నా చేత నిలయానికి వెళ్లనని ఒట్టు వేయించుకున్నాడు. "అమ్మా, నువ్వంటే నాకు చాలా ఇష్టం. నువ్వు ఆఫీస్ కి వెళ్లి అక్కడినించి నిలయానికి వెళ్లి ఇంటికి వస్తుంటే నాతో వుండే సమయం తగ్గిపోవడం వల్ల నువ్వు నాకు దూరమౌతున్నావన్న బాధ కలుగుతోంది. నేనింకా 6 నెలలలో అమెరికా వెళ్ళిపోతాను. నేను వెళ్ళాక కావాలంటే వెళ్ళు" అన్నాడు. ఇక సరే అనక తప్పలేదు.

మా అమ్మాయి M.B.B.S. చదువుకుంది. తన పెళ్లి విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. అప్పుడు మాత్రం మావారు పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి వచ్చారు, ఎందుకంటే ఏమైనా చేసుకొమ్మని చెప్తారేమోనని. పూజ్యశ్రీ అమ్మగారు, మావారికి ధ్యానం, నాకు పారాయణ చెప్పారు. తరవాత కొన్నాళ్ళకి మా అమ్మాయికి పెళ్లి కుదిరింది. మా అమ్మాయి పెళ్లవ్వగానే VRS తీసుకుని, ఉద్యోగం మానెయ్యాలని నా ఉద్దేశం. లోన్ పెట్టి పెళ్ళిచెయ్యాలి కనక, ఉద్యోగం మానడానికి వీలులేదన్నారు మావారు.

ఇంక నాకు VRS తీసుకునే అవకాశం లేదని, పూజ్యశ్రీ అమ్మగారికి మనసులోనే చెప్పుకుని బాగా ఏడ్చేదాన్ని. ఈ సమయంలో పూజ్యశ్రీ అమ్మగారు ఒక లీల చేశారు. మాకు చర్లపల్లిలో 400 గజాల స్థలం వుంది. అప్పటి రియల్ ఎస్టేట్ పరిస్థితి చాలా దారుణంగా వుంది. కనక ఆవైపు మాదృష్టి పోలేదు. ఒకరోజు మావారి ఫ్రెండ్ ఫోన్ చేసి, మీ ప్లాట్ కి బేరం వచ్చింది రమ్మని చెప్పాడు. అప్పుడు డబ్బులు ఎక్కువరావని తెలిసినా ఫ్రెండ్ చెప్పాడని వెళ్లారు. నేను వెంటనే పూజ్యశ్రీ అమ్మగారు, మాస్టరుగార్ల పటం ముందు కూర్చుని, "అమ్మగారు, పెళ్ళికి సరిపడా డబ్బులు ఇప్పించండి" అని దణ్ణం పెట్టుకున్నాను. కాస్సేపటికి మావారు అక్కడనించి ఫోన్ చేసి. "ఇక్కడ రేటు యెంత వున్నా, మొత్తం మీద, 20 లక్షలు యిస్తానన్నాడు" అని చెప్పారు, పూజ్యశ్రీ అమ్మగారి కరుణకి నాకు నోట మాట రాలేదు. అనుకున్నట్టే నేను రిజైన్ చేసాను.

నేను నాగోల్ కి వెళ్లి సమయం అంతా సేవలో, సన్నిధిలో గడపవచ్చు అనుకున్నాను.. కానీ మావారు అప్పటినించి బాబాగుడికి వెళ్లడం, ప్రసాదం పంపించడం, బాబాకి వస్త్రాలు కుట్టడం, అమ్మగారి దర్శనానికి వెళ్లడం...ఇవన్నీ నిషేధించారు. నాకు మతిపోయినంత పనైంది. పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల నెమ్మది, నెమ్మదిగా పరిస్థితులు చక్కబడి, ఆయన తనంతట తానే నన్ను నాగోలు సేవకి పంపించే విధంగా మార్పు వచ్చింది.

పూజ్యశ్రీ అమ్మగారిని గమనిస్తూవుంటే, చాలా గొప్ప విషయాలు తెలుస్తాయి. చక్కటి జీవితవిధానము నేర్చుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నేను గమనించింది ఏమిటంటే,,,,

1) ప్రేమతత్వం. అందరితోనూ, ప్రేమగా వుంటారు. ప్రేమగా మాట్లాడతారు. ఎంతటి కలతపడిన మనసైనా సరే యిట్టే సేదతీరుతుంది.

2) ఏ సమస్యనైనా సరే సూక్ష్మమైన విషయాలు కూడా వదలకుండా, లోతుగా ఆలోచిస్తారు.

3) రోజువారీ కార్యక్రమాలలో, ఎట్టి పరిస్థితులలోనూ నియమం తప్పరు.

4) మనం ఒక విషయం అమ్మగారికి చెప్పుకుంటే ఎప్పటికి అది బయటికి రాదు.

ఇంకొక లీల చెప్పి ముగిస్తాను. ఒకరోజు మా అబ్బాయి అమెరికా నించి ఫోన్ చేసి "అమ్మా! నాకు ఒంట్లో బాగోలేదు. మోకాలుకి వెనకవైపు, కొద్దిగా తొడ దగ్గర, రెండు రూపాయల కాయిన్ అంత సైజులో కురుపు లాగ వచ్చింది. కారు నడపడానికి చాలా యిబ్బందిగా వుంది. డాక్టర్ దగ్గరకి వెడితే చాలా ఖర్చయ్యేటట్టు వుంది" అని చెప్పాడు. వెంటనే మా అమ్మాయికి ఫోన్ చేస్తే, "అది చాలా డేంజర్, కాలు తీసినా ఆశ్చర్య పోనక్కరలేదు" అంది. అది వినగానే చాలా బాధనిపించి, ఇక నాకు శరణ్యం ఎవరు? పూజ్యశ్రీ అమ్మగారికి ఈ సంగతి చెప్పుకున్నాను(మనసులోనే). ఆ రాత్రి కల వచ్చింది. అందులో పూజ్యశ్రీ అమ్మగారు నన్ను పిలిచి ఒక కప్పు నిండా ప్రసాదం పెట్టారు. "ఇంత ఎందుకమ్మా?" అంటే, "ఇంటికి తీసుకెళ్లి అందరూ తినండి" అన్నారు. ఇంటికి వచ్చాక చూస్తే, అమెరికాలో వున్న మా అబ్బాయి, ఇంట్లోనే వున్నాడు. ఆ ప్రసాదం తాను కూడా తిన్నాడు. అదీ కల! మర్నాడు వాడి దగ్గరనించి నాకు ఫోన్ వచ్చింది, "అమ్మా! హాస్పిటలుకి వెళ్లాను, వాళ్ళు దానిని క్లీన్ చేసి, ఏమి

మిగతా 29వ పేజీలో

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

పదవ ప్రసంగము

ఉపాసన

శివగీతలో ఆదిశంకరాచార్యులవారు యిలా అన్నారు:

శ్లో॥ ఉపసంగమ్య బుద్ధ్యా
యదాసనం దేవతాత్మనా ।
తదుపాసన మన్తః
స్యాత్తద్బహిః సంపదాదయః ॥

భావం : ఉపాసన విషయంలో దైవము తన స్వరూపానికి భిన్నమైనవాడు కాదని తెలుసుకొని, అంతఃకరణములో దేవతారూప సమీప్యాన్ని పొందడం, దానిలో స్థిరంగా నిలవడం ఉపాసన. ఇది ఆంతరికమైన ఉపాసన. సంపదాది ఉపాసన బహిర్గతమైనది. భగవంతుని సామీప్యాన్ని పొందడం అహంగ్రహోపాసన అంటారు. అహంగ్రహోపాసనంటే ఉపాసకుడు ఉపాస్యాన్ని (ఉపాసించబడే దానిని) తనకంటే భిన్నమైనదిగా ఎరుగక అభిన్నత్వాన్ని గ్రహించి ఉపాసించడం. ఇది సగుణబ్రహ్మమునకు, నిర్గుణబ్రహ్మమునకు కూడా సరిపోతుంది.

బ్రహ్మ యొక్క సంపదుపాసన

సంపదాది ఉపాసన - సంపత్, ఆరోప, అధ్యాస, సంవర్గ భేదాల చేత నాలుగు రకాలు. సంపదుపాసనా లక్షణము శివగీతలో యిలా వున్నది:

శ్లో॥ అల్పస్య చాధికత్వేన
గుణ యోగాద్విచిన్తనమ్ ।
అనన్తం వై మన ఇతి
సంపద్విధిరుదీరితః॥

భావం : అల్పగుణాలు కలిగిన దానియందు, అనంత గుణాలు కలిగిన దానిని భావించి ఉపాసించడం

సంపదుపాసన. మనసు అనంతమైనదని ఊహించి ఉపాసించడం సంపదుపాసన విధి.

ఛాందోగ్యోపనిషత్తులో ఆధ్యాత్మ, అధిదేవ అనే రెండు రకాలైన ఉపాసనా పద్ధతులు చెప్పబడ్డాయి. వాటిలో ఆధ్యాత్మ సంపదుపాసన 'మనో బ్రహ్మేతి ఉపాసీత' అనే వాక్యము చేత చెప్పబడింది. అధిదేవ సంపదుపాసనకు రెండో మంత్రం ద్వారా 'మనోమయ ఆకాశాత్మా' అని తెలుపబడింది. ఇక్కడ మనోమయుడు అంటే మనసుతో గల సంబంధం వల్ల ప్రవృత్తి నివృత్త్యాత్మకమైన పరమాత్ముని ఉపాసన గ్రహించాలి. అలాగే సర్వగతుడు, సూక్ష్ముడు, రూపము మొదలైనవి లేనివాడు కావడం వలన ఆ పరమాత్ముని ఉపమానము ఆకాశంతో చెప్పబడింది. ఇక్కడ ఆకాశ మనోరూపుడైన బ్రహ్మయొక్క గుణాలు ఏకదేశత్వములుగా (ఒకే చోట వున్నట్లుగా) చెప్పబడ్డాయి. రాబోయే అధ్యాయంలో 8వ ఖండంలో మొదటి నుంచి తేజము, మనస్సు, ఆకాశము – అన్నింటిలోనూ బ్రహ్మదృష్టి విధిపూర్వకంగా తెలుపడానికి 'మనోబ్రహ్మ, ఆకాశోబ్రహ్మ' అని ప్రారంభించబడినది. 'మనుతే అనేన ఇతి మనః' – దేనితో ఆలోచించబడుతుందో అది మనస్సు (అంతఃకరణము), అది బ్రహ్మము. ఈ ఉపాసన ఆధ్యాత్మ సంపదుపాసన. మనసు ద్వారా బ్రహ్మసాక్షాత్కారము జరుగుతుంది. బ్రహ్మదర్శనానికి యోగ్యమైన సాధనము మనస్సు. మనస్సులో బ్రహ్మదృష్టి కలిగివుండటం సంపదుపాసన కదా! ఆ మనస్సు అనే బ్రహ్మనికి వాక్కు (మాట), ఘ్రాణము (వాసన), చక్షువు (కన్ను), శ్రోతము (చెవి) అనే నాలుగు పాదాలు వున్నాయి. ఈ నాలుగింటిలోనూ మనోరూపుడైన బ్రహ్మము యొక్క పాదదృష్టిని పొందాలి. ఆకాశ రూపుడైన అధిదేవ బ్రహ్మము యొక్క పాదదృష్టిని అగ్ని, వాయువు, ఆదిత్యుడు, దిక్కులు — వీటిలో పొందాలి. ఆకాశము బ్రహ్మము అనే ఉపాసన ఆధిదైవిక సంపదుపాసన.

మనోబ్రహ్మము యొక్క వాగ్రూపమైన పాదము, ఆకాశబ్రహ్మము యొక్క అగ్నిరూపమైన పాదము జ్యోతి చేత భాసిస్తుంది. మనోబ్రహ్మము యొక్క ఘ్రాణపాదము, ఆకాశబ్రహ్మము యొక్క వాయు రూపమైన అధిదేవత యొక్క జ్యోతి చేత ప్రకాశాన్ని పొందుతుంది, అంటే భాసిస్తుంది. మనోబ్రహ్మము యొక్క చక్షుఃపాదము, ఆకాశబ్రహ్మము యొక్క ఆదిత్యాది రూపమైన అధిదేవత చేత భాసిస్తుంది. అలాగే మనోబ్రహ్మము యొక్క శ్రోతము ఆకాశబ్రహ్మము దిగ్రూపమైన పాదము చేత భాసిస్తుంది.

ఈ సంపదుపాసన చేసేవారు చాలా కాలం దీప్తిమంతమైన ప్రపంచంలో నివసించి చివరకు ఉత్తమలోకాలను పొందుతారు. ఇది వేదంలో చెప్పబడిన బ్రహ్మం యొక్క సంపదుపాసన. సాలిగ్రామ నర్మదేశ్వరము మొదలైన వాటిలో హరిహరాది భావన చేసి విధి పూర్వకమైన పరిచింతనమే పురాణాలలో చెప్పబడిన సంపదుపాసన. సాలగ్రామము మొదలైనవి అల్పగుణాలు కలవి. అధికగుణాలు కల హరిహరాదులను వాటిలో భావించడం వలన అధిక గుణయోగము వాటికి కలుగుతుంది. అందువలన సాలిగ్రామనర్మదేశ్వరము మొదలైనవి సంపదుపాసన చేత ఉపాస్యులౌతారు. రాముడు, కృష్ణుడు మొదలైన విగ్రహాలు కూడా ఇలాగే ఉపాస్యాలు.

బ్రహ్మము యొక్క ఆరోపోపాసన

శ్లో॥ విధానారోప్య యోపాసా సారోపః పరికీర్తితః ।
యద్వదోంకార ముద్గీథముపాసీతేత్యుదాహృతః ॥
(శివగీత)

భావం : వేదంలో విధించబడిన ఆరోపాత్మకమైన చింతన పద్ధతి 'ఆరోపోపాసన' అని పిలవబడుతుంది. 'ఓం' కారాన్ని ఉద్గీథ రూపంలో ఉపాసించడాన్ని 'ఆరోపోపాసన' అంటారు.

ప్రధానమైన విధి (కర్తవ్యం)ని అనుసరించి సముదాయ విశేషము యొక్క అవయవముతో సంబంధం కలిగి వుండడం ఆరోప సంపదుపాసనము. ఉద్గీథసామము యొక్క ప్రథమ భక్త్యవయమైన (మొదటి భక్త్యవయమైన) ఉద్గీథ శబ్దము చేత వాచ్యమైన కర్మతో సంబంధముంచి పరమాత్మ ప్రతీకమైన 'ఓం' కారము లో స్థిరమైన బుద్ధిని నిలిపి, 'ఓం' కారాన్ని ఉద్గీథ రూపంలో ఉపాసించాలి. 'ఓం' కారాన్ని ఉచ్చరించే ఉద్గాత సామమును గానం చేస్తాడు. కాబట్టి 'ఓం' కారమే ఉద్గీథము. ఈ విషయంలో చాందోగ్యోపనిషత్తులో "ఓమిత్యేత దక్షరముద్గీథముపాసీత..." 'ఓం' అనే అక్షరమును

కర్మాంగ విషయమైన ఉద్గీథ రూపంలో ఉపాసించాలి. ఈ ఉచ్చారణ చేత భగవంతుడు ప్రీతి చెందుతాడు.

తనకు ప్రియమైన నామాన్ని ఇతరుల ద్వారా వినడం మానవునికి సంతోషాన్ని కలిగిస్తుంది. అలానే పరమాత్మని అన్యప్రతిబింబాలకు ప్రణవము (ఓంకారము) ప్రతీకమైనది. కాబట్టి ప్రణవము పరమాత్మను ఉపాసించడానికి అత్యంత ఉత్తమమైన సాధనము. ఈ కారణంగానే వేదాలలోను, జప, కర్మ, స్వాధ్యాయ, దానము మొదలైనవాటిని ప్రారంభించేటప్పుడు ముగించేటప్పుడు ఓంకారాన్ని ఎక్కువగా ఉచ్చరిస్తారు. ప్రణవము (ఓంకారము) రసాలన్నింటికంటే రసవత్తముడైన పరమాత్మ రూపంగా ఉపాసింపదగినది. ఈ చరాచర ప్రపంచంలో పృథ్వి రసము – అంటే సారవంతమైనది. భూమికి జలము రసము. జలానికి ఔషధులు రసము. ఔషధులలో పురుషుడు రసము. పురుషునిలో వాణి రసము. వాణిలో ఋక్కులు రసము. ఋక్కులలో, అంటే వేదాలలో, సామము రసము. సామములలో అత్యంత సారవంతమైనది ఉద్గీథ రూపమైన ఓంకారము. ఇది అష్టమ రసము (ఎనిమిదవ రసము). ఈ ఉపాసన ఆరోపోపాసనము

అంటే కర్మలను మాత్రమే చేసేవారు గొప్ప అజ్ఞానాన్ని పొందుతారు. కర్మను విడచి ఉపాసన మాత్రమే చేసేవారు కర్మ చేసేవారి కంటే ఎక్కువ అజ్ఞానాన్ని పొందుతారు. కాబట్టి కర్మ, ఉపాసన - రెండు ఒకేసారి ఆచరించాలని శృతి ఉద్దేశము.

బ్రహ్మము యొక్క అధ్యాసోపాసన

శివగీతలో అధ్యాస మనబడే ప్రతీకోపాసనా లక్షణము ఇలా వున్నది–

శ్లో॥ ఆరోపో బుద్ధిపూర్వేణ య ఉపాసా విధిశ్చ సః ।
యోషిత్యగ్నిమతిర్యత్ర దధ్యాసః స ఉదాహృతః ॥

భావం : బుద్ధిపూర్వకంగా బ్రహ్మాన్ని దేనిమీదైనా ఆరోపించడం ఉపాసన అనబడుతుంది. ద్యులోకము, పర్జన్యుడు, పృథ్వి, పురుషుడు స్త్రీ – వీటిలో అగ్నిబుద్ధిని వుంచి వీటిని ధ్యానించడం అధ్యాస మనబడుతుంది.

ఛాందోగ్యములో 5వ అధ్యాయంలో 4వ ఖండము నుంచి 8వ ఖండము వరకు ఇవి వర్ణించబడ్డాయి. వీటిలో ద్యులోకము, పర్జన్యుడు, పృథ్వి, పురుషుడు, స్త్రీ (యోష) అనే ఈ 5 పదార్థాలయందు అగ్నిని చింతన చేయాలని చెప్పబడివుంది అంటే వాటిని అగ్ని రూపంలో ఉపాసించాలి.

1. అసా వావ లోకో గౌతమాగ్నిః : ద్యులోకాగ్నికి ఆదిత్యుడు (సూర్యుడు) సమిధ, కిరణాలు పొగ (ధూమము), రోజులు జ్వాలలు చంద్రుడు బొగ్గు (అంగారము), నక్షత్రాలు అగ్ని కణాలు(విస్ఫులింగాలు). ఇటువంటి ద్యులోకాగ్నిలో నీరు (ఆపము) అనే శ్రద్ధను హోమం చేయాలి. పైన చెప్పిన ద్యులోకాగ్నిలో క్రమంగా సమిధగా సూర్యుని, ధూమంగా కిరణాలను, అగ్ని మంటలుగా రోజులను, బొగ్గుగా (అంగారముగా) చంద్రుడిని, అగ్ని కణాలుగా నక్షత్రాలను చింతన చేయాలి.

2. పర్జన్యో వావ గౌతమాగ్నిః: పర్జన్యాగ్నికి వాయువు (గాలి) సమిధ, మేఘమే పొగ (ధూమము), విద్యుత్తే మంట (అర్చి), మెరుపే బొగ్గు (అంగారము), ఉరుమే అగ్ని కణము(విస్ఫులింగము). ఇలా చింతన చేయాలి.

3. పృథివీ వావ గౌతమాగ్నిః : పృథ్వి (భూమి) అనబడే అగ్నికి సంవత్సరాలు, రాత్రులు, దిక్కులు, విదిక్కులు వరుసగా సమిధ, ధూమము, అర్చి, అంగారము విస్ఫులింగము అనే భావనతో చింతన చేయాలి. ఉపాసించాలి.

4. పురుషో వావ గౌతమాగ్నిః : పురుషాగ్నికి శిరోజాలు (జుట్టు), ప్రాణాలు (పంచప్రాణాలు), జిహ్వ (నాలుక), చక్షువు (కన్ను), శ్రోతము (చెవి) వరుసగా సమిధ, ధూమము, అర్చి, అంగారము, విస్ఫులింగము అని ఉపాసించాలి.

5. యోషా వావ గౌతమాగ్నిః : స్త్రీ అనే అగ్నికి ఉపస్థము (జననాంగము) ఉపమంత్రణము (పిలుపు/

బుజ్జగింపు), యోని, అంతఃకరణము (అంతరేంద్రియము – యోనికి లోపల ఇంద్రియము), అభినందనము (సొగసు/ సుఖము) వరుసగా సమిధ, ధూమము, అర్చి, అంగారము, విస్ఫులింగము అనే భావంతో ఉపాసించాలి.

ఈ పంచాగ్నులకు (ఐదు అగ్నులకు) హోమద్రవ్యాలు జల రూపమైన శ్రద్ధ, సోమము, వర్షము, అన్నము, రేతస్సు.

పంచాగ్నులను ఉపాసించడం వలన కలిగే ఫలము అర్చి మొదలైన వాటి మార్గంలో హిరణ్యగర్భ లోకము పొందటము. ఇది వేదాల చేత ప్రతిపాదింపబడిన ప్రతీక అధ్యాసోపాసన. స్వభావసిద్ధంగా ప్రతీకోపాసన సంపదుపాసన అని, అధ్యాసోపాసన అని రెండు రకాలు. సంపదుపాసన ఆరోప్య ప్రధానమైనది (గుణాలను ఆపాదించి ఉపాసించేది).

అధ్యాసోపాసన అధిష్ఠాన ప్రధానమైనది. ఆరోప్య ప్రధానమైన సంపదుపాసనములో సగుణ బ్రహ్మము యొక్క మూర్తిలో సగుణ బ్రహ్మాన్ని చింతన చేస్తారు.

ఉద్గీథోపాసన కూడా ఆరోప్య ప్రధానమైనది కావడం వలన సంపదుపాసనలో భాగమవుతుంది. అధిష్ఠాన ప్రధానమైన అధ్యాసోపాసనలో అధిష్ఠానాన్ని ఉద్దేశించి ఆరోప్య పదార్థాన్ని ధ్యానించాలి.

యోష లో అగ్ని చింతన, సగుణచింతనలో నిర్గుణ బ్రహ్మను అనుసంధానము చేయడం – ఇటువంటి దృక్పథంతో ప్రతికోపాసనము సంపదుపాసనమనీ, అధ్యాసోపాసనమనీ రెండు రకాలు.

బ్రహ్మము యొక్క అధ్యాసోపాసన

శ్లో॥ క్రియాయోగేన చోపాసా
విధిః సంవర్గ ఉచ్యతే ।
సంహృత్య వాయుః ప్రలయే
భూతాన్యేకోఽవసీదతి ॥
(శివ గీత)

భావం : క్రియాయోగంలో ఉపాసన చేసే పద్ధతి సంవర్గోపాసన. ప్రళయకాలంలో సంవర్త వాయువు సకల భూతాలను నశింపజేస్తుంది.

చంద్రుడు అస్తమించే (అస్తావస్థ) సమయంలో వాయువుతో లీనమౌతాడు. నీరు ఎండిపోయినపుడు వాయువులో కలిసిపోతుంది. ఇలా వాయువు, అగ్ని మొ॥న మహాబల సంపన్నమైన పదార్థాలను వశపరచుకుంటుంది.

దాని గుణము సంవర్గము (సంగమము – కలుపుకోవడము). దాని ఉపాసన సంవర్గోపాసన ఆధ్యాత్మ సంవర్గోపాసన చాందోగ్యోపనిషత్తులో చెప్పబడింది.

ముఖ్యమైన ప్రాణాన్ని సంవర్గ గుణాలు కలిగినదిగా గుర్తించి దానిని ఉపాసించాలి మానవుడు నిదురించేటప్పుడు అతడి వాక్కు (నోరు), కళ్ళు, చెవులు, మనస్సు అన్ని ప్రాణంలో లీనమవుతాయి. అంటే నిదురపోయే సమయంలో వాక్కు మొదలైన వాటిని ప్రాణవాయువు తన వశములో ఉంచుకుంటుంది.

దేవతలలో బహిర్గతమయ్యే వాయువు సంవర్గము. వాక్కు మొదలైన ఇంద్రియాలలో ముఖ్యమైనదైన ప్రాణము సంవర్గము. పూర్వము చెప్పబడిన విధానములో ప్రళయ సమయంలో సంవర్తనము అనే పేరు కల వాయువు తన శక్తి చేత అగ్ని మొదలైన వాటిని వశపరచుకుని వుంటుంది. కాబట్టి దానిని సంవర్గ రూపములో ఉపాసించాలి.

ఇలా అగ్ని మొదలైన వాటిని మొదలైన వాటిని వశపరుచుకోవడం అనే కర్మను నిమిత్తంగా స్వీకరించి చేసే ఉపాసనే సంవర్గోపాసన.

సంవర్గోపాసనలో సంవర్గ గుణాలు గల వాయువును ధ్యానించాలి. అలాగే ముఖ్యమైన ప్రాణము నిదురించే సమయంలోవాక్కుమొదలైనవాటినిపశపరుచుకుంటుంది. కాబట్టి దీనిని ధ్యానించాలి. ఇక్కడ కూడా వాక్కు మొదలైన వాటిని వశపరచుకోవటం అనే కర్మను ఆధారంగా చేసుకొని ప్రాణాన్ని సంవర్గ రూపంలో ఉపాసించాలి.

సంవర్గోపాసన అధి దేవ, ఆధ్యాత్మ భేదాల వల్ల రెండు రకాలు. చాందోగ్యములో "వాయుర్వావ సంవర్గః, ప్రాణో వావసంవర్గః" అని చెప్పబడింది.

- సశేషం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

శశాంకబాబుగారికి కొంచెం దూరం నడిచినా కాళ్లు నొప్పులు వచ్చేవి. రైలు ప్రయాణాలు చేయలేకపోయేవారు. ఆహారం సరిగా జీర్ణం అయ్యేది కాదు. నదులలో, చెరువులలో స్నానం చేయలేకపోయేవారు. శ్రీ ఆనందమయ అమ్మ శశాంకబాబు చేత కొన్ని విధాలైన ప్రాణాయామ పద్ధతులను చేయించారు. అమ్మ అనుగ్రహంతో కొంతకాలానికి శశాంక బాబు ఆరోగ్యం బాగా మెరుగయింది. ప్రతిరోజు చెరువులో స్నానం చేయడం, ఎంత దూరమైనా నడవడం చేసేవారు. అంతేకాదు, ఆయన జీర్ణక్రియ కూడా బాగా మెరుగుపడింది. అమ్మ ఆయనను ఆ విధంగా అనుగ్రహించారు. శ్రీ ఆనందమయి ఆ సందర్భంలో భక్తులతో, "ఈ విధమైన ప్రక్రియలను నేను ఎవరి చేత చేయించలేదు. ఒక్క శశాంక బాబుకు మాత్రమే ఈ సాధనను విధించాను. అందరూ ఒకే రకమైన శారీరక, మానసిక ప్రవృత్తులు కలవారై వుండరు. వారి వారి అర్హతలను బట్టి తగువిధమైన సాధనలు విధించబడతాయి" అన్నారు

కొంతకాలం తర్వాత అమ్మను భక్తులు తమ తమ ఇండ్లకు తీసుకువెళ్లి అక్కడ సత్సంగాలు, సంకీర్తనలు జరుపుకునేవారు.

ఒకసారి షాహ్-బాగ్ లో గురుప్రియ దేవి అమ్మతో, "అమ్మా! మేము మీకోసం బాగా పరితపించే సమయాలలో మీకు ఆ విషయం తెలుస్తుందా?" అని అడిగింది. ఆనందమయి అమ్మ, "మీరు నన్నే స్మరిస్తూ నా దర్శనం కోసం వ్యాకులపడుతున్న సమయాలలో నా కన్నుల ఎదుట కనిపిస్తారు. అప్పుడు మీరు నన్ను ఏకాగ్రచిత్తంతో స్మరిస్తున్నారని నాకు తెలుస్తుంది" అన్నారు.

ఒకసారి ఒక అపరిచిత వ్యక్తి సిద్దేశ్వరికి వచ్చాడు. అమ్మ అక్కడ తమ ఆసనంపై కూర్చునివున్నారు. భక్తులందరూ సంకీర్తన చేస్తున్నారు. ఉన్నట్లుండి ఆ వ్యక్తి అమ్మ దగ్గరకు వచ్చి అమ్మ ఎదుట నిలుచున్నాడు. అతడు అమ్మతో "అమ్మా! మిమ్మల్ని ఒక విషయం అడుగవచ్చునా?" అన్నాడు. అమ్మ అదేమిటో చెప్పమన్నారు. అతడు "అమ్మా, నేను మిమ్మల్ని ఒక విషయం గురించి మనసులోనే ప్రశ్నించాను. ఆ విషయాన్ని నేను నా నోటితో చెప్పను. అసలు నేను మీ దగ్గరకు ఏ కారణంగా వచ్చానో చెప్పగలరా?" అన్నాడు. అమ్మ ఒక క్షణకాలం అతని వైపు చూశారు. ఆ తర్వాత అమ్మ "నీ ప్రశ్నకు జవాబు చెప్పేశాను. నువ్వే అర్థం చేసుకో. నువ్వు మనసులో అడిగిన ప్రశ్నకు నేను మనసులోనే సమాధానం చెప్పేశాను" అంటూ చిన్నగా నవ్వారు. అతడు మరి ఏమి మాట్లాడలేదు. అతడు ఆ రోజు ఇంటికి వెళ్లలేదు. అమ్మ ఇంట్లోనే కూర్చుని రోజంతా విపరీతంగా యేడ్చాడు. అతడు "అమ్మను నేను క్షమాపణ వేడాలి. అందుకు అమ్మ అనుమతించాలి"

అని వేడుకోసాగాడు. అయితే అతడు ఏమి అడిగాడో, అమ్మ ఏమి చెప్పారో తెలియదుగానీ అమ్మ అతనిని అసలు పట్టించుకొనలేదు. కనీసం అతని వైపు కూడా చూడలేదు. అతడు మౌనంగా తలవంచుకుని అక్కడి నుండి వెళ్లిపోయాడు.

ప్రతి సంవత్సరం వలెనే ఒక ఏడాది కాళీ పూజాదినం వచ్చింది. అమ్మ ఆదేశం ప్రకారం బజారు నుండి కాళీమాత విగ్రహం తెప్పించి యథావిధిగా పూజాదికాలు నిర్వర్తించారు. అయితే పూజా అనంతరం ఆ సంవత్సరం ఆ విగ్రహాన్ని నిమజ్జనం చేయలేదు. దానిని షాహ్-బాగ్ లోని తోటలో ప్రతిష్ఠించమన్నారు అమ్మ. అమ్మ ఆదేశం ప్రకారం ఒక ప్రత్యేక స్థలంలో కాళీమాతను ప్రతిష్ఠించారు.

లోగడ జరిగిన కాళీపూజకు ఎందరో భక్తులు రావటం జరిగింది. ఆశు అని పిలవబడే ఆశుతోషి బంద్యోపాధ్యాయ అనే భక్తుడు కూడా పూజోత్సవానికి వచ్చాడు. అతని కుటుంబము 'ఢీకాటులీ' లోని రామకృష్ణ తోటలో వుండేది. అతని తల్లి తనకు వచ్చిన స్వప్న సందేశాన్ని అమ్మకు చెప్పి షాహ్-బాగ్ లో కాళీపూజ జరుపుకున్నది. ఆ తర్వాత వీరేంద్ర దాదా అనే భక్తుడు కూడా కాళీపూజ చేయాలని అనుకున్నాడు. పూజకు అంతా సిద్ధమయ్యింది. పూజానంతరం వీరేంద్ర దాదా కాళీమాతకు బలి ఇవ్వటానికి ఒక మేకను తెచ్చాడు. అది చూచిన అమ్మ కళ్ళు ఎరుపెక్కాయి. కఠినమైన స్వరంతో అమ్మ "బలి ఇవ్వటానికి ఎంత మాత్రం ఒప్పుకోను" అంటూ గద్దించి పలికి ఆ మేక దగ్గరకు వెళ్లి కూర్చొని దాని శరీరాన్ని ప్రేమతో నిమిరారు. భక్తులంతా నిశ్చేష్టులై చూస్తూ కూర్చున్నారు. పూజా కార్యక్రమం ముగిసింది. అమ్మ లేచి నిలబడి ఆశుని పిలిచారు. "ఈ మేకను నీ చేతుల్లోకి తీసుకొని నా వెంట నడు" అని అతనితో చెప్పారు. అలా చెప్తూ అమ్మ బయటకు నడవగా ఆశు మేకను ఎత్తుకుని అమ్మ వెంట నడవసాగాడు భక్తులంతా అమ్మను అనుసరిస్తూ నడవసాగారు. అప్పటికి సంధ్యా సమయం అయింది. చేతులలో లాంతర్లతో భక్తులు నడుస్తున్నారు. షాహ్-బాగ్ లో కొందరు భక్తులచే నిర్వహింపబడుతున్న ఒక ఆశ్రమము, ఒక అన్న సత్రము వున్నాయి. అదే రమణాశ్రమంగా ప్రఖ్యాతి గాంచింది. ఆ రమణాశ్రమం వెనక నున్న మైదానంలో ఒక గుండ్రని ఆకారంలో ఒక చెరువు వున్నది అమ్మ ఆ చెరువు వద్దకు వెళ్లి మేకను అక్కడ వదిలిపెట్టమని చెప్పి ఆ మేక శరీరానంతటిని తన కాలుతో నిమిరి షాహ్-బాగ్ వైపు నడిచారు. ఆ మేక కూడా అమ్మ వెనకాలే నడుస్తూ షాహ్-బాగ్ చేరింది. అమ్మ ఇంటికి రాగానే అమ్మ ఎక్కడ అయితే కూర్చున్నారో, అక్కడే అమ్మ పక్కనే ఆ మేక కూడా వచ్చి కూర్చుంది. అప్పటికే పూజా కార్యక్రమం పూర్తి అవ్వడంతో భక్తులందరూ తీర్థప్రసాదాలు తీసుకొని ఇండ్లకు బయలుదేరారు. అప్పుడు గంభీర స్వరంతో భక్తులను ఉద్దేశించి "ఇకపై ఎక్కడా, ఎవరూ జంతుబలి ఇవ్వటానికి వీలులేదు. ధూప, దీప, పుష్ప, గంధార్చన, నివేదన, హోమాదికములు మాత్రమే నిర్వహించాలి" అంటూ శాసించారు శ్రీ ఆనందమయి అమ్మ

భక్తులంతా వెళ్లిపోయినా మేక మాత్రం అమ్మను విడిచి వెళ్ళక అమ్మవద్దనే వుండిపోయింది. శ్రీ ఆనందమయి మాత ఇంటిలో ఒక సభ్యుని వలె మెలగసాగింది ఆ మేక. భజన సమయంలో అమ్మ ఒడిలో కూర్చొనటం, రాత్రి అమ్మ పక్కనే పడుకొని నిద్రించటం, అమ్మ ఎటు వెళ్తే అటు అమ్మ వెనకాలే తిరగటం చేస్తుండేది. అది చలికాలం. ఒకరోజు చలి తీవ్రత బాగా ఎక్కువగా వుంది. అమ్మ ఒక కంబళి తెచ్చి ఆ మేకకు కప్పి దానిని నిద్రపుచ్చారు. ఆ విషయం చెబుతూ అమ్మ నవ్వుతూ "పూర్వజన్మలో వీడు కంబళిధారి. అందుకే ఈ జన్మలో కంబళి వీడి వంటి మీదకు వచ్చింది" అన్నారు. వీరేంద్ర దాదా చాలాసార్లు "అమ్మా ఈ మేక మీతో యింత సన్నిహితంగా మెలగటానికి కారణం ఏమిటి? అసలు ఈ మేక ఎవరమ్మా?" అని అడిగేవాడు. అమ్మ చాలా రోజులు మౌనం వహించారు. ఒకరోజు మాటల సందర్భంలో "వీడు గత జన్మలో ఒక సన్యాసి. కర్మ దోషాల వల్ల యిప్పుడీ దేహం ధరించాడు" అన్నారు. అమ్మ యింటి సమీప మైదానంలోని పచ్చ గడ్డిని మేసి కొన్నాళ్లకు ఆ మేక చాలా బలంగా తయారయింది. అమ్మ ఒకసారి ఢాకా నుండి ఏదో ఊరికి వెళ్లి అక్కడ కొన్ని రోజులు వుండటం జరిగింది. ఆ సమయంలో ఆ మేక షాహ్-బాగ్ విడిచి ఎటో వెళ్లిపోయింది.

- సశేషం

మాతృదేవి దివ్యసన్నిధానములో మాస్టరుగారి ఆరాధనోత్సవాలు

శ్రీమతి టి. పద్మావతి

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజుల 34వ ఆరాధనా మహోత్సవ వేడుకలు తిథి ప్రకారం (చైత్ర శుద్ధ సప్తమి) మార్చి 28న, తేదీ ప్రకారం ఏప్రిల్ 12న, మాతృదేవి దివ్యసన్నిధానములో వైభవంగా జరిగాయి.

తిథి ప్రకారం ఆరాధనోత్సవ వేడుకలు::

శోభకృత్ నామ సంవత్సరంలో, చైత్ర శుద్ధ సప్తమి మంగళవారంనాడు(28-3-23) పూజ్యశ్రీ మాస్టరుగారి 34 వ ఆరాధన మహోత్సవం శ్రీ అలివేలుమంగమ్మ దివ్య సన్నిధానములో వైభవోపేతంగా జరిగింది.

ముందురోజు రాత్రినించే పూజ్యశ్రీ బాబా అమ్మగారు మాస్టరుగార్లు ఆశీనులయ్యే వేదిక అలంకరణ ప్రారంభమయ్యింది. ఉదయమే మేలుకొలుపుతో ఉత్సవం మొదలై, కాకడ హారతి, ఉదయప్రార్థన, కాఫీ నివేదన, మంగళస్నానం పూర్తయ్యాయి. అనంతరం పూజ్యశ్రీ భరద్వాజ మహారాజులవారు మధ్యలో ఆసీనులుకాగా, వారికి కుడిపక్కన శ్రీ సాయినాథులవారు, ఎడమపక్కన పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి కొలువుతీరివుండగా, అనేకరకాలైన పుష్పాలతో, పుష్పగుచ్ఛాలతో వారిని అలంకరించుకుని, దివ్యజనని బృందావనానికి కూడా ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, అల్పాహారం నివేదన మొదలైన సేవలు శ్రద్ధాభక్తులతో పూర్తిగావించారు. అనంతరం గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు విశేషమైన ఈ పుణ్యతిథిని పురస్కరించుకుని సత్సంగం చేశారు

అందులో,,, "అసలు మనం మహాత్ముల ఆరాధనలు, జయంతులు ఎందుకు జరుపుకోవాలి? అని లోతుగా ఆలోచించుకుంటే, అది ఎంతటి శ్రేయోదాయకమో తెలుస్తుంది. ఎండాకాలంలో చెట్టునీడన సహజంగానే చల్లగా వున్నట్లు, ఈ భూమిమీద మహాత్ములు వున్న క్షేత్రాలలో మన మనస్సు, ప్రాణశక్తి సామరస్యంతో పనిచేసే అవకాశం వుంటుంది. అది ముందుగా ఏర్పడిన వ్యూహం ప్రకారం జరుగుతుంది. ఉదాహరణకు మందారచెట్టు చిన్నగా వున్నప్పుడే దానికి పూసే పువ్వు ఏ రకంగా వుండాలో ముందుగా నిర్ణయింపబడివున్నట్లే, ఇలాంటి మహాత్ముల దగ్గరకి వచ్చినవారికి కూడా ఇటువంటి మార్పులు రావాలి అని ముందుగా నిర్ణయింపబడి వుంటుంది. అయితే మన మనస్సుని ప్రతిరోజూ లేదా విశేషమైన రోజులలో, కొంత సమయాన్నైనా నిరామయంగా, నామం పారాయణలతో వుంచగలగాలి. అందుకే మన ప్రాచీనులు ఆధ్యాత్మిక బలం కలగడం కోసం ఏకాదశులని, పండగలనీ ప్రత్యేక రోజులు ఏర్పాటు చేశారు. అంటే కనీసం అలాంటి పర్వదినాలలోనైనా మనస్సుని భక్తి భావంతో నియంత్రణ చేయమని. అలా నియమబద్ధంగా మనస్సుని వుంచగలిగిననాడు, మహాత్ముల జయంతి, ఆరాధనలలో మనలో ప్రాణశక్తి, మనస్సు విశేషంగా పనిచేసి, ఆధ్యాత్మికంగా ఎంతో మార్పురావడం జరుగుతుంది. అందువల్ల మహాత్ముల ఆరాధనలు జయంతులు చేసుకోవాలి. ఇటువంటి రోజుల్లో మన శరీరంలో వున్న ప్రతి కణం ఆధ్యాత్మికంగా వుండడానికి సంసిద్ధంగా వుందని గుర్తించి, యిక్కడ పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసన్నిధిలో అద్భుతమైన ఆధ్యాత్మిక శక్తి మరీ ప్రచండంగా వీస్తుందని గ్రహించి, ఈ పండుగని సద్వినియోగం చేసుకునేలా అనుగ్రహించమని అపార కరుణామూర్తులు అలివేలుమంగా సహిత భరద్వాజ మహరాజులకు

కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలి అర్పిస్తూ, మన జీవితాలని వారే నడిపించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ పూజ చేసుకుందాం" అని వారి సత్సంగాన్ని ముగించి, అక్కడకి వచ్చిన, రాలేని వారందరి తరఫున పూజ నిర్వహించారు.

తదనంతరం భరద్వాజ గురుదేవులకు ప్రీతికరమైన పిండివంటలతో కూడిన భోజనాన్ని మహానివేదన చేసి, భక్తులందరూ మహాప్రసాదం తీసుకుని, మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఉద్యుక్తులయ్యారు.

తేదీ ప్రకారం ఏప్రిల్ 12న ఆరాధనోత్సవ వేడుకలు::

పూజ్య భరద్వాజ గురుదేవుల ఆరాధన మాతృదేవి సన్నిధానములో వైభవోపేతంగా జరిగింది. నిత్యసేవలలో భాగంగా ఆ రోజు అలివేలుమంగా భరద్వాజులకు, ఆవుపాలు, విభూది, తులసి, పన్నీరు యిత్యాది మంగళ ద్రవ్యాలతో శ్రీసూక్త, పురుషసూక్త, నమక చమక సహితంగా అభిషేకం జరిగింది. దివ్యజనని బృందావనాన్ని చాణుక్య బృందం, రకరకాల డ్రై ఫ్రూట్స్ తో శోభాయమానంగా అలంకరించారు. కలువపువ్వులో భరద్వాజ గురుదేవుల మూర్తి, చెరొకపక్కా నెమళ్ళూ, గురుదేవుల పాదుకలు, అత్యంత సహజత్వాన్ని సంతరించుకున్నాయి. శ్రీమతి లయరాగిత, శ్రీ ద్వారకనాథ్ గార్లు భక్తులందరి తరఫున భరద్వాజ గురుదేవులకు అష్టోత్తర సహిత షోడశోపచార పూజ గావించారు. తరవాత భజన గీతాలు గానం చేస్తుండగా భక్తులొకొక్కరూ పూజ్యశ్రీ అలివేలుమంగా సహిత భరద్వాజ మహరాజులకు ప్రణామాలర్పించుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం, గురుదేవులకు వివిధ రకాలైన శాకపాకాలతో మృష్టాన్నభోజనం నివేదన చేసి, హారతిచ్చి, మధ్యాహ్న కార్యక్రమాలకు ముగింపు పలికారు.

ఆ రోజు ఉదయం ఒంగోలు, లాయరుపేట శ్రీ సాయిబాబా మందిరంలో బృందావనాలంకృతులైన భరద్వాజ గురుదేవులను సేవించుకున్న భక్త బృందం మధ్యాహ్న సమయానికి మాతృదేవి సన్నిధికి చేరుకోగా, సుమారు 4 గంటల ప్రాంతానికి గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ గారు సత్సంగం చేశారు. అందులో కొన్ని అంశాలు,,,,,

"పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ ఆరాధనా మహోత్సవం చేసుకున్న ప్రతిసారి మనసులో నాకు ఒక ప్రశ్న వస్తుంది. అసలీ ఆరాధనా మహోత్సవం ఎందుకు చేసుకుంటున్నాము? ఈ రోజున పవిత్రంగా గడపడంలో అర్థం ఏమిటి? అన్న ఆలోచన వస్తుంది. ముఖ్యంగా పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ సమాజానికి, ఈ ప్రపంచానికీ, నాకు చేసిన మేలు గుర్తుకు వస్తుంది. మరి మనందరం అంటే మేలుపొందిన వాళ్ళందరం ఆయన చెప్పినట్లు చేస్తున్నామా అని ఆలోచించుకోవాలి. నిజమైన ఆధ్యాత్మికత అంటే ఏమిటని చెప్పారు?. కానీ ఈరోజు ఆధ్యాత్మికత ఎన్ని వెర్రితలలు వేస్తోంది? ధర్మంగా వుండటం అంటే ఏమిటి? దాన్ని విస్మరిస్తే ఎంత నష్టం జరుగుతుంది? ఉదాహరణకు, ఎంతోమంది కష్టపడితే మనకి లభించిన ధనాన్ని పేకాటలో పందెంగా పెట్టి ఆడటం వల్ల కొన్ని జన్మలకి భుక్తి లేకుండా పోతుందని చెప్పారు పూజ్యశ్రీ మాస్టరుగారు. వృత్తి, విద్య, ఆరోగ్యం, కుటుంబం పట్ల బాధ్యతలు యివన్నీ సరిగ్గా ఆచరిస్తే ఆ తరవాత ఆధ్యాత్మికత వస్తుందిట. వీటన్నిటిని ఎలా ఆచరించాలి పూజ్యశ్రీ మాస్టరుగారి రచనల్లో చెప్పబడివుంది. మనకున్న బలహీనతలన్నింటినీ ఎలా అధిగమించాలో కూడా చెప్పారు. కనుక వాటన్నిటిని ధర్మబద్ధంగా ఎలా ఆచరించాలో ఆ మార్గం వైపుకి మన మనస్సుని తీసుకెళ్లాల్సిందే. అటువంటి ధర్మాచరణ మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర మనం చూడవచ్చు. అమ్మ ఎప్పుడూ పళ్ళబిగువున ధర్మం ఆచరించలేదు. చాలా ఆనందంగానూ, ఉత్సాహంగాను ధర్మాచరణ చేసేవారు. అందుకే సుధీంద్రబాబు గారు, గులాబ్ బాబా, పరాడ్ సింగా అనసూయమాత పూజ్యశ్రీ అమ్మగారిని కొనియాడారు.

అలనాడు శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా పూజ్యశ్రీ మాస్టరుగారు మనందరికీ నిజమైన ఆధ్యాత్మికత బోధించారు. కనుక అంతటివారికి తగిన శిష్యులుగా తయారవ్వాలని, ఆయనకి నచ్చినట్లుగా మనజీవితం ఉండేటట్లుగా అనుగ్రహించమని ప్రార్థిస్తూ వేడుకుందాం" అని శ్రీ బాబుగారు సత్సంగాన్ని ముగించారు.

అప్పుడు సమయం సాయంత్రం ఆరు గంటలు కావస్తుండటంతో సంధ్యహారతి చేసుకుని, పూజ్య గురుదేవులకి మనస్ఫూర్తిగా నమస్కరించుకుని 'శిష్యప్రియ' హారతితో ఆ రోజు ఉత్సవానికి ముగింపు పలికారు. ●

ఆశాజ్యోతి

శ్రీ వాసుదేవరావు

(మాస్టరుగారి పరిచయ భాగ్యాన్ని పొందిన పిమ్మట అప్పటి వరకు తాను చేసిన బాబా పూజా విధానం ఎంత యాంత్రికమో అర్థమయి, వారి ప్రబోధాన్ని అందుకుని సాయినాథుని అనన్య భక్తితో కొలిచేందుకు మార్గదర్శకులైన మాస్టరుగారిని, బాబా గారిని రెండు చక్షువులుగా భావించి సాయి మాస్టర్ సన్నిధిలో తను పొందిన అనుభూతులను అందించుచున్నారు.)

1944 నుంచి బాబా మా ఇలవేల్పు. మాతల్లి, పినతల్లి చెఱుకుపల్లిలో భజనలు ఏకాహాలు చేస్తూండేవారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఎక్కడ బాబా ఏకాహం జరుగుతున్నా మా వాళ్ళు వెళ్తూండేవారు. అందువల్ల నాకు చిన్నప్పట్నించీ బాబా అంటే భక్తి శ్రద్ధలు అలవడ్డాయి.

1978వ సంవత్సరం నా జీవితంలో ఒక మలుపు. నాకు గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ లో ఆపరేషన్ జరిగి బెడ్ మీద వున్నాను. అప్పుడు నిత్యం సంధ్యా సమయాలలో ఆదిపూడి మోహన్రావ్ గారు, అతని మిత్ర బృందం వారు నా దగ్గర కొచ్చి బాబా గురించి గోష్ఠి జరుపుతుండేవారు. బాబా ఊది ప్రసాదాలు ఇచ్చి వెళ్తుండేవారు. అప్పుడు అతను భరద్వాజ మాస్టారుగారు వ్రాసిన బాబా చరిత్ర తెచ్చిస్తే ఆ బుక్ ని చదవటం తటస్థపడింది. అది చదవటం జరిగిన తర్వాత మాస్టార్ గారిని చూడాలనే సంకల్పం నాలో దృఢంగా కల్గింది. 1979 లో మా అన్నగారు విద్యానగర్ వెళ్ళి మాస్టారుగారిని చూసినట్లు చెప్పారు. అలాంటి అవకాశం అదృష్టం నాకెప్పుడు కల్గుతుందోనని నా మనస్సు వువ్విళ్ళూరేది. నేను హాస్పిటల్లో వున్నప్పుడే ఒక సద్గురువు వద్ద ఉపదేశం పొందాలనేటటువంటి దృఢమైన ఆకాంక్షతో, నిష్ఠాగరిష్టుడు, నిత్యము ఆధ్యాత్మిక సాధనలో నున్నటువంటి మా పెద్ద బావగార్ని ఉపదేశం చేయవలసిందిగా అర్థించిన మీదట ఆయన నా అభ్యర్థనను నన్ను తిరస్కరిస్తూ "నీ ఆరాధ్య దైవమైన సాయినాథుడినే నీ సద్గురుగా ఎంచుకుని సేవించుకో. ఇంక వేరే గురువుతో పని లేదు" అని సలహా యిచ్చారు. నేను అలాగే బాబానే నా గురువుగా యెంచుకొని పూజా పునస్కారాలు చేసుకుంటున్నాను. సాయినాథుడు ఆధ్యాత్మిక సాధనలో నాకు పురోభివృద్ధిని కల్గించటం కోసమే 1980 సం॥లో మాస్టార్ గారిని విద్యానగర్ నుండి ఒంగోలుకు పంపించటం తటస్థించింది. 1979 నుంచి మాస్టార్ గారిని దర్శించాలన్న నాలోని తృష్ణ పెల్లుబికి ఆయనను దర్శించే భాగ్యం కలిగింది.

మాస్టార్ గారితో పరిచయ భాగ్యం కలిగిన తర్వాత అంత వరకు నేను బాబాను సేవించిన విధానం ఎంత యాంత్రికమో అర్థం అయ్యింది. అప్పటి వరకు లేనటువంటి తత్వ విచారణ నాలో ముమ్మరంగా మొదలైంది. వారి చెంత నున్నంతసేపు ఎంతో ప్రశాంతత చేకూరటం ఆశ్చర్యానందాలు కలిగించేవి. వారు సాయి తత్వాన్ని, ఆధ్యాత్మికతను గూర్చి అనంద పారవశ్యంతో బోధిస్తుంటే వినే మేము కూడా ఆనందపారవశ్యంలో మైమరచి పోయేవారము. ఎన్ని

గంటలు అలా గడిచిపోయేవో మాకు తెలిసేది కాదు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వారి సన్నిధికి వెళ్తే తిరిగి ఇంటి కొచ్చేసరికి అర్ధరాత్రి ఒంటి గంట కూడా అయ్యేది ఒక్కోసారి వారి సన్నిధిలో ఆకలి దప్పులు కూడా మాకు జ్ఞప్తికి వచ్చేవి కావు. అదే విధంగా ఆయన కూడా వాటి గురించి ఆలోచించే వారు కాదు. ఆయన ఉచ్ఛ్వాస, నిశ్వాసాల్లో బాబానే నిల్పుకున్నారు. నిరంతరం బాబా స్వరూపం తప్ప మరొకటి వుండేది కాదు. ఆయన ఆలోచనా తరంగాలలో బాబా మినహా మరొకళ్ళు వుండేవారు కాదు. సాయినాథుడు తన తత్వ ప్రచారం కొరకే 1963 లో మాస్టార్ గారి వ్యక్తిత్వాన్ని తన కిష్టమైన రీతిలో మూసపోసినట్లుగా నాకన్పిస్తూంటుంది. ఈ నా అభిప్రాయాన్ని వారి దగ్గర వెలిబుచ్చితే ఆయన మందహాసంతో 'అందరూ యిలానే అంటున్నారు" అని అన్నారు.

విద్యానగర్ లో వున్నప్పుడు మాస్టారు గారు తన వుద్యోగం చేసుకొంటూనే నిర్ణీత సమయాల్లో మాత్రమే బాబా తత్వ ప్రచారం చేసుకునేవారు. అందువలన సర్వజ్ఞుడు, కాలాతీతుడైన బాబా తన అనుంగు బిడ్డడయిన మాస్టారి కార్యక్రమము పరిసమాప్తి కాదని, వారి పూర్తి సమయాన్ని కేటాయించడం కోసమా అన్నట్లు ఆయనకు విద్యానగర్ లోని పరిస్థితులను పూర్తిగా ప్రతికూలం చేసి అక్కడ్నుంచి ఒంగోలుకు తరలింపచేశారు. భార్యా బిడ్డలతో, ఆయన ఒంగోలుకు వచ్చినది మొదలు, రాత్రింబవళ్ళు సాయి తత్వ ప్రచారమందు తనను తాను ఒక సమిధగా అర్పించుకున్నారు. ఆయన చేసిన కృషి అనితర సాధ్యము. ఆ రకంగా మాస్టారుగారిని వేలాది మంది భక్తులకు మార్గదర్శకుడిగా, ఒక ఆశాజ్యోతిగా సమాజానికి అందించారు బాబా.

ఆయన కుటుంబ పోషణలో కూడా నాకు మొదట్లో కొన్ని సందేహాలు ఏర్పడ్డాయి. రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి యే ఒక్కరి దగ్గర ఒక పైసా కూడా తీసుకునేవారు కాదు. మరి మాస్టారు గారు ఎవరు దక్షిణ యిచ్చినా తీసుకుంటున్నారే, అని సందేహం. కొంత కాలం తర్వాత ఒక భక్తుని ద్వారా బాబానే నివృత్తి చేసారు. సాక్షాత్తు సాయినాథుడే రాజేంద్ర ప్రసాద్ అనే ఒకరికి కలలో కన్పించి భరద్వాజకు 100 రూ॥లు దక్షిణగా యివ్వవలసిందిగా ఆదేశించినారు. అతను అప్పటి వరకు మాస్టారు గారి పేరు విన్నవాడు కాదు. చూసిన వాడు కాదు. వాళ్ళ ఊళ్ళో వుండే భక్తుల ద్వారా మాస్టారు గారి గురించి తెలుసుకొని, ఒంగోలు వచ్చి 100 రూ॥లు దక్షిణగా సమర్పించి, బాబా ఇచ్చిన ఆదేశాన్ని అమలుపరచారు.

ఆయన మూర్తీభవించిన ఒక తేజోమూర్తి. సత్సంగాలు జరపటానికి మాస్టారుగారు వస్తే సాయినాథుడే స్వయంగా వచ్చినట్లు భావించేవారు. బాబా భక్తులలో చాలా మందికి మాస్టారుగారి పట్ల అంకిత భావం వుండేది. ఎందరో దుఃఖపీడితులు, బాధా తప్త హృదయులు వారి వారి దుఃఖ నివృత్తికై మాస్టార్ గారి దగ్గర కొచ్చి చెప్పుకున్న తర్వాత వారి దుఃఖాన్ని మరిచి మరల తిరిగి వెళ్ళే సమయానికి నవ్వుతూ వెళ్తూండేవారు. ఆబాలగోపాలం - వేదం చదువుకున్న పండితుల దగ్గర్నుంచి అక్షరాభ్యాసానికి నోచుకోని వారి వరకు - ఆయనను చూచి, ఆయన సంభాషణలను విని ఆనంద పారవశ్యం చెందుతూండేవారు. నా వరకూ నాకు ఆయన గొప్ప తేజోమూర్తి, మహాపురుషుడు, అజాత శత్రువు, మహా మనీషి!!

మాస్టార్ గారు తన జీవితంలో కేవలం కాలక్షేపణకు ఎప్పుడూ మాట్లాడటం కానీ, తన సమయాన్ని దుర్వినియోగ పరచటం గాని చేయగా మేమెవ్వరం ఎప్పుడూ చూడలేదు. సమయం ఎంత విలువైనదో, అందరూ ఆదర్శప్రాయంగా జీవిస్తూ ఆనందంగా ఎలా జీవించాలో అందుకు అనుగుణంగా మన ఆలోచనలను ఎలా సరిచేసుకోవాలో చెప్పేవారు. ఒకసారి అనుకోకుండా నేను మాస్టార్ గారు ఒకే ట్రైన్ లో ఒకే కంపార్ట్మెంట్లో ప్రయాణం చేయడం జరిగింది. వారు చీరాలలో వుండే హోమియో డాక్టర్ గారైన పోట్లూరి సుబ్బారావ్ గారిని కలవటం కోసం చీరాల వెళ్తున్నారు. ఆ కొంచెం సేపట్లోనే మాస్టార్ గారు బాబా గురించి చెప్తుంటే నేనే కాదు మాతో ప్రయాణం చేసే వారు కూడా ఎంతో ఆనంద పారవశ్యులయ్యారు. నిజంగా వారు ఆనందస్వరూపులు గనుకనే ఇతరులకి కూడా ఆనందాన్ని పంచి పెట్టేవారు. ఆనందోబ్రహ్మ!

- సశేషం

(గత సంచిక తరువాయి)

మరికొందరు భక్తులు

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

అబ్దుల్ రహీమ్ రంగారీ :

సం॥1913లో థాణేలోను, శిరిడీ ప్రాంతంలోను గూడ ప్లేగు చెలరేగింది. ఆ సమయములో థాణే జిల్లాకు చెందిన అబ్దుల్ రహీమ్ రంగారీ, భార్యకు ఒక మాసంగా జబ్బుగావున్నది. ఆమె గొంతు, ముఖము బాగా వాచి, ఆమె ఏమీ తినలేకపోయేది. ఏ మందూ పనిచేయలేదు. అపుడే 'భుక్తే' అను వారి పొరుగింటి న్యాయవాది, ఆమెను సాయిబాబా వద్దకు తీసుకువెళితే, వారు తగ్గించగలరని చెబితే ఆ దంపతులు శిరిడీ బయలుదేరారు. వాళ్ళు బయల్దేరిన దగ్గరనుండీ ఆమె పరిస్థితి మెరుగవసాగింది. కొంతసేపటికి ఆమె టీ త్రాగగలిగింది; నాసిక్ చేరేసరికి మరికొంత ఆహారం తీసుకోగలిగింది. ఆ తర్వాత జరిగినది రంగారీ యిలా వ్రాశాడు : "మేము శిరిడీచేరి సాయిబాబాకు నమస్కరించాము. వారు హిందుస్థానీలో, "మీరు ఎక్కడినుండి వస్తున్నారు? ఎందుకోసమొచ్చారు?" అన్నారు. మేము థాణే నుండి వస్తున్నామని, నా భార్యకు గొంతు వాచిందనీ చెప్పేసరికి, 'ఆమెను మశీదులోకి రమ్మను' అన్నారు బాబా. ఆమెను మెట్లెక్కించగా ఆమె బాబాకు నమస్కరించింది. ఆయన ఆమె శిరస్సును తాకి, 'ఖుదా అచ్ఛా కరేగా' . 'భగవంతుడు సరిచేస్తారు' అన్నారు. నాకై నేను వారికి ₹1.25లు సమర్పిస్తే ఆయన స్వీకరించి ఊదీ యిచ్చారు. ఆమెకు గొంతువాపు త్వరగా తగ్గుతూండడంతో, బాబా మమ్మల్ని వుండమన్నా కూడా మేము రెండు గంటల తర్వాత తిరుగు ప్రయాణమయ్యాము. కొత్తచోట అనవసరంగా నా భార్య, రెండేళ్ళ బిడ్డలతో కలసివుండటం నాకు యిష్టం లేకపోయింది.

మేము వచ్చిన టాంగాలోనే కోపర్ గావ్ కు బయలుదేరి సగం దూరం వెళ్ళాము. కాని అక్కడ టాంగా యిరుసు విరిగి దారి మధ్యలోనే మేము నిలచిపోయాము. అప్పుడు రాత్రి 10 గం॥ లయింది. అక్కడ వేరేవాహన వసతిలేదు, రోడ్డు నిర్మానుష్యంగా వున్నది. మేము వర్షము, బందిపోటు దొంగల బారిన పడే ప్రమాదమున్నది. మేము బాబా మాటలు లెక్కచేయనందుకు బాధపడ్డాము. ఆ స్థితిలో రెండుగంటలు గడిచాయి. అర్ధరాత్రి దాటాక ఒక బండి వస్తున్న శబ్దము, 'రాణే నుండి వచ్చిన వారెవరూ?' అని అరుస్తున్న కంఠధ్వనీ వినిపించాయి. ఇంతలో ఆ బండి మావద్దకు వచ్చింది. ఆ కంఠధ్వని ఆ బండివాడిదే! థాణే నుండి వచ్చినది నేనేనని చెప్పి, మా దుస్థితి అతడికి తెలియడం, అంతటి అకాలంలో అతడు రావడం ఎలా జరిగిందని అడిగాను. మిమ్మల్ని తీసుకురమ్మని, సాయిబాబాయే చెప్పారని అతడు చెప్పాడు. మేము టాంగా యెక్కి శిరిడీ చేరేసరికి తెల్లవారు ఝామున 2 గంటలయింది. బాబా మాకోసం ఎదురు చూస్తున్నారు. మేము మశీదు చేరాక బాబా, "నా అనుమతి లేకుండానే మీరు వెళ్ళిపోయారు. అందుకే దారిలో యిలా జరిగింది" అన్నారు. మేము వారిని క్షమాపణ కోరాము. అపుడు ఆయన మమ్మల్ని మశీదు దగ్గరే మిగిలిన రాత్రంతా వుంచి, తాము లోపలికి వెళ్ళి ఎప్పటి వలెనే ధ్యానం చేసుకున్నారు. ఉదయమే సాయి భిక్షకు వెళ్ళి వచ్చి తాము కొంత తిని మిగిలిన రొట్టెలు, కూరలూ మాకిచ్చి తినమన్నారు. మేము తిన్నాం. నా భార్య గూడ అంత గట్టి ఆహారం తినగలిగింది. అపుడు ఆయన అనుమతించాక, మేము బయటకు పోయి టాంగాకోసం వెతికి వెతికి తిరిగివచ్చి, ఎక్కడా టాంగానే లేదని చెప్పాము. బాబా "టాంగా వున్నది, వెళ్ళి చూడు!" అన్నారు. నేను వెనక్కి తిరిగి చూచేసరికి అక్కడ టాంగా వున్నది. అంతలో అది అక్కడికెలా వచ్చిందో తెలియలేదు. బాబా ఆశీర్వదించాక మేము బయలుదేరాము. తర్వాత నా భార్య ఆరోగ్యం బాగానే వున్నది.

నేను శిరిడీ వెళ్ళినది ఆ ఒక్కసారేగాని, ఆ దర్శనంతోనే వారిపై నాకు స్థిరమైన విశ్వాసమేర్పడింది. నేను నిద్రించబోయేముందు వారిని, యితర మహనీయులనూ తలచుకుంటాను. నేను వారిని తీవ్రంగా తలచుకొన్నప్పుడు వారు ప్రత్యక్షంగా నా యెదుట కన్పించేవారు.

నేను అక్కడున్న 2 గం॥ల కాలంలోనూ బాబాతో మాట్లాడినది చాలా తక్కువ. బాబా నుదుట, తలమీద చందనం అద్ది వుండడం గమనించాను. ముస్లింలు అలా గంధం పూసుకోరు. వారు యివన్నీ ధరించడం ఎలా జరిగిందని అడిగాను. బాబా, 'జైసా దేశ్, వైసా వేష్' , 'దేశమెలా వుంటే వేషమలావుండాలి' అన్నారు. 'ఇక్కడివాళ్ళు వారి దేవతలను ఆరాధించక నన్ను దైవంగా కొలిచి ఆరాధిస్తున్నారు. వారిని అసంతృప్తి పరచడమెందుకు? నా వరకూ నేను భగవంతుని బానిసనే' అన్నారు. ఆయనే మళ్ళీ, "నీవు నిన్న వచ్చివుంటే బాగుండేది. ఇక్కడ సంగీతకచ్చేరీ జరిగింది. నేను రాత్రంతా దుఃఖిస్తూనే వున్నాను. వీళ్ళంతా నన్ను తిట్టారు" అన్నారు. 'వాళ్ళు మిమ్మల్ని ఎందుకు తిట్టారు?' అనడిగితే బాబా, "నేను 'తిట్టారు' అంటే ఇక్కడి వాళ్ళకు అర్థంగాదు; కాని నీకర్థమవుతుంది" అన్నారు. నిజానికి 'తిట్టారు' అన్నమాటకు (సూఫీ పరిభాషలో) వినోద పరచారు' అని అర్థమని నాకు తెలుసు గనుక, 'భగవంతుని స్తుతిచేస్తుంటే భక్తులు దుఃఖిస్తారు, నవ్వుతారు, లేక నృత్యం చేస్తారు' అన్నాను. బాబా, "అంతే! సరిగా చెప్పావు. నీ గురువు నీకున్నారుగదా!" అన్నారు. నేను, "అవును, వున్నారు. హబీబ్ అలీషా చిస్తీ నిజామీ" అని చెప్పాను. "అందుకే నీకు అర్థమయింది" అన్నారు బాబా. నా గురువుకు ఎక్కడకు వెళ్ళినాగూడా సంగీతముండవలసిందేనని నాకు గుర్తొచ్చింది,"

తుకారామ్ బాగ్ :

తుకారామ్ బాగ్ (శిరిడీ) యిలా చెప్పాడు:

'సం॥ 1912లో గోదావరి కాలవలలోనికి మొదటిసారిగా నీరు విడిచేటప్పుడు నేను 20 మైళ్ళదూరంలో వున్న 'కరంజీగామ్' గ్రామానికి బయలుదేరుతున్నాను. అక్కడేదైనా పని సంపాదించి జీవనం చేయాలని నా ఉద్దేశం. నేను ఇంకా శిరిడీలోనే కోపర్గావ్ రోడ్డుమీద వుండగానే లెండీకి వెళ్ళే దారిలో బాబా ఎదురైె నా భుజంమీద చేయివేసి, 'నీవు వెళ్ళవద్దు' అన్నారు. నేను వినిపించుకోకుండా ఆ గ్రామానికి వెళ్ళాను. నాకా మరురోజే జ్వరమొచ్చి చాలా రోజులు కొనసాగింది. నేను పనిచేసుకోవడం అలా వుంచి, అక్కడ బంధువుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడవలసి వచ్చింది. అలా 15 రోజులు జ్వరం కాచి తగ్గాక నేను తిరిగి శిరిడీ వచ్చేందుకు ఓపిక వచ్చిందిగాని, తిరిగివచ్చాక గూడా నాకు 11 1/2 నెలలు జ్వరమొస్తూనే వున్నది. అప్పుడు నాకు బాబా ఊదీ యివ్వమని మా అమ్మను అడిగాను. అది పెట్టుకున్న మరురోజునుండే జ్వరం తగ్గిపోయింది."

విఠల్ రావ్ మరాఠే:

ఇదివరకు శిరిడీసాయి సంస్థానంలో పూజారిగా వుండిన విఠల్ రావ్ మరాఠే యిలా చెప్పాడు:

"ఒకరోజు ఉషఃకాలంలో యిద్దరు శ్రద్ధాళువులైన పఠానులు సాయిని దర్శించాలని ద్వారకామాయికి వచ్చారు. ఆయనకు సలాముచేసి వారియెదుట కూర్చున్నారు. ఆ చలిలో వణికిపోతున్న వారిద్దరిలో ఒకరి మనస్సులో, 'సరిగా యీ సమయంలోనే ఒక కప్పు వేడి 'చా' త్రాగితే, ఎంత బాగుంటుంది?' అన్పించింది. కాని మరుక్షణమే అతడు – 'ఈ గ్రామంలో అది లభిస్తుందనుకోవడం వెఱ్ఱి' అని తలచి ఆ ఆలోచన విడిచివేసాడు. సరిగ్గా అదే సమయంలో భక్తుడు సగుణమేరూ నాయక్ గూడ సాయి దర్శనానికి వచ్చాడు. శిరిడీవచ్చిన భక్తులు కోరితే, వారికి అతడు భోజనము మొదలైన సదుపాయాలు చేస్తుండేవాడు. అతడు బాబాకు నమస్కరించి, 'బాబా, మీకు "నాస్తా" (అల్పాహారం) ఏమి చేసుకురమ్మంటారు?' అని అడిగాడు. 'సగుణ్ , నీవు వెంటనే వెళ్ళి ఒక కెటిల్ నిండుగా వేడి వేడి 'చా' తీసుకురా!' అన్నారు బాబా. అతడు నివ్వెరపోయాడు. కారణం అన్ని సం॥లుగా ఆయనను సేవిస్తున్నా, ఆయన టీ త్రాగడం అతడెన్నడూ చూడలేదు. అయినా అతడు ఒక్క మారుప్రశ్న అయినా వేయకుండా, వెంటనే వెళ్ళి కొద్ది నిమిషాలలో ఆవిర్లు చిమ్ముతున్న 'చా' తెచ్చాడు. సాయి వెంటనే అది కప్పులలో పోయించి ఆ పఠానులిద్దరికీ అందించారు. ఆ పఠానులు నివ్వెరపోయి ఎంతో సంతోషంగా ఆయన ప్రసాదించిన టీ త్రాగారు. అయినా తమ మనసులో తలంపు ఆయనకెలా తెలిసిందోనని, వాళ్ళు ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన సామాన్యుడైన సాధువుగాడని, గొప్ప దివ్యపురుషుడనీ వారు గుర్తించారు."

- సశేషం

ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి రాజ్యలక్ష్మి, విజయవాడ

నేను వివాహం కాకముందునించి బాబాని పూజించుకునేదాన్ని. మా పుట్టింటిలో నేనొక్క దాన్నే బాబాని పూజించే దాన్ని. నాకు 1999 లో వివాహం అయ్యింది. ఆ సమయంలో శ్రీ సాయినాథులవారు గొప్ప లీల చేశారు.

నాకు ఇద్దరు అన్నయ్యలు. మా అమ్మగారికి చాలా అనారోగ్యంగా వుండేది. నేను పెళ్లి చేసుకోవద్దని నిర్ణయం తీసుకున్నాను. మా అమ్మని చూసుకుంటూ తన దగ్గరే వుండాలని నా కోరిక. నేను విజయవాడలో స్టెల్లా కాలేజీ దగ్గరున్న బాబా గుడికి తరచుగా వెళ్లేదాన్ని. నాకు ఏ సమస్య వున్నా ఆయనతో చెప్పుకునే దాన్ని. నేను B.L. పూర్తి చేసాక M.L. చేసేముందు, శ్రీ బాబావారిని 'ఆ కోర్స్ లో చేరాలా వద్దా? చేరవద్దంటే నేను ఇంటికెళ్ళాక ఆ విషయం నాకు స్పష్టంగా తెలియాలి' అని అడిగి, దణ్ణం పెట్టుకుని ఇంటికి వచ్చాను. రాగానే అమ్మ, "నీకు పెళ్లి చేసేద్దాం అనుకుంటున్నాము" అని చెప్పింది. "నేను పెళ్లి చేసుకోనని చెప్పాను కదా" అన్నాను. "లేదమ్మా, నువ్వు పెళ్లి చేసుకోవాలి. ఆ పెళ్ళి నా చేతులమీదుగా చెయ్యాలి" అని చెప్పింది. అయితే M.L. అయ్యాక చేసుకుంటానన్నాను. రెండు సంవత్సరాలు ఆ చదువు పూర్తయ్యి నువ్వు వచ్చేసరికి అమ్మని చూడాలని అనుకున్నా నేను వుండకపోవచ్చు" అంది. ఇక అమ్మని బాధపెట్టడం యిష్టం లేక చదువు ఆపేసాను. నేను బాబాకి దణ్ణంపెట్టి చెప్పుకుని ఇంటికి రాగానే సమాధానం చెప్పేసారు.

తరవాత నాకొక సంబంధం వచ్చింది, దాదాపు కుదిరిపోయింది. కానీ ముహూర్తం దగ్గర వాళ్లకి మాకూ మాట తేడా వచ్చింది. దానితో మా వాళ్లకి బాధనిపించి మర్నాడు ఉదయం వెళ్లి వాళ్లకి ఈ సంబంధం వొద్దని చెబుదామని నిర్ణయించుకున్నారు. అదే రోజు తెల్లవారురుఝామున నాకు సాయినాథుడు స్వప్నదర్శనమిచ్చి నాతో, ''అమ్మాయీ! ఎందుకమ్మా బాధపడతావు? ఈ జన్మలో నీకు ఆ అబ్బాయితోనే పెళ్లి అవుతుంది, ప్రకృతిరీత్యా ఆడవాళ్ళకి వచ్చిన యిబ్బంది వల్ల నువ్వు పారాయణ చెయ్యలేదు, ఈ పారాయణ పూర్తయితేకానీ నీ కర్మ తీరదు. కనక నేను పారాయణ చేస్తాను. నువ్వు విను" అని బాబా, వారిచరిత్ర వారే చదివి నాకు వినిపిస్తున్నారు. మధ్యమధ్యలో "వింటున్నావా, నిద్రపోతున్నావా?" అని అడుగుతున్నారు. నాకు పారాయణ విలువ ఎంతటిదో అప్పుడు అర్థం అయ్యింది. దాదాపు మూడు గంటలు చదివారు. ఈ స్వప్నం ఉదయం 5 గంటలకి మొదలయ్యింది. ఉదయం 8 గంటలకి పూర్తయ్యింది. అప్పుడు మెలకువ వచ్చింది. ఇంతసేపు పడుకున్నానేమిటని నాకే ఆశ్చర్యం వేసింది. రోజూ ఉదయమే ఇంటి పనులన్నీ నేనే చేసేదాన్ని. నన్ను నిద్ర లేపలేదేమని అమ్మని అడిగాను. "రోజూ లేస్తావు కదా, ఈ రోజు లేవలేదంటే ఒంట్లో బాగోలేదేమోననుకున్నాను" అన్నది. నేను బాబాగారు నాకు స్వప్నంలో చెప్పిన విషయం అమ్మతో చెప్పాను. అప్పుడు అమ్మ, "ఇప్పుడే మీ అన్నలిద్దరూ మనకి ఆ సంబంధం వొద్దని చెప్పటానికి వాళ్ళ ఇంటికి వెళ్లారు" అని చెప్పింది. పైగా

మావాళ్ళెవ్వరూ బాబాని నమ్మరు. కనక అమ్మ కూడా అంతగా పట్టించుకోలేదు. సరే నాకు బాబా చెప్పినదాన్ని బట్టి ఆయన ఏం చేస్తారో చూద్దామని నేనూ ఊరుకున్నాను. కాసేపటికి మా అన్నలిద్దరూ వచ్చి, "ఈ సంబంధమే ఖాయమయ్యిందని, మేము వెళ్ళగానే వాళ్ళ ఇంట్లో వాళ్ళు మీ ఇష్టం వచ్చిన ముహుర్తానికే చేసుకుంటామని చెప్పారని, చెల్లి కోసం కొన్న బంగారం, పట్టుచీర చూపించారని, మనం చెప్పినట్లే రేపే తాంబూలాలు పుచ్చుకుందామన్నారని, ఎంత దగ్గరలో ముహూర్తం పెట్టినా వాళ్ళకి అభ్యంతరం లేదని అన్నారని" చెప్పారు. నాకు ఇదంతా ఆ సాయినాథుని లీల అని అర్థం అయ్యింది.

ఈలోపు అమ్మకి ఆరోగ్యం బాగోక ఆసుపత్రిలో చేర్పించాము. తాను కొంచెం కోలుకున్నాక, దగ్గరలోనే ముహూర్తం పెట్టేసారు. నేను నా పెళ్లి శుభలేఖ తీసుకుని, బాబాగుడికి వెళ్లి ఆయనతో, 'మీరు కుదిర్చిన పెళ్లే జరుగుతోంది, మరి మీరు తప్పక నా వివాహానికి వచ్చి నన్ను ఆశీర్వదించాలి" అని కోరుకున్నాను.1999 ఫిబ్రవరి 12 ఉదయం 5 , 6 గంటల మధ్య జరిగింది. పంతులుగారు అరుంధతి నక్షత్రం చూపించటానికి బైటికి తీసుకువచ్చారు. అప్పటికి బాగా వెలుతురు వచ్చేసింది. నేను, మా స్నేహితురాలు ఇప్పుడు అరుంధతి నక్షత్రం ఎలా కనపడుతుందని నవ్వుకున్నాము. అప్పుడు పంతులుగారు, "అమ్మా ఆకాశంకేసి చూసి, అరుంధతి నక్షత్రం ఉన్నట్లు భావన చేసి నమస్కారం చేసుకోండి" అన్నారు. అప్పుడు నేను తలపైకెత్తి చూడగానే సూర్యబింబంలో సాయినాథులవారు, కుడిచెయ్యి పైకెత్తి, ఎడమచేతితో కఫ్నీని లాక్కుంటూ నన్ను ఆశీర్వదిస్తున్నారు. నాకే ఇలా కనిపిస్తున్నారా అందరికి కనిపిస్తున్నారా అని సందేహం వచ్చి పక్కనున్న నా స్నేహితురాలిని అడిగాను. నాకు సూర్యబింబమే కనిపిస్తోందని చెప్పింది. నాకు చాలా ఆనందం వేసింది. 'నా పెళ్ళికి తప్పక రండి అని పిలిచినందుకు ఇలా దర్శనం యిచ్చారా' అనుకున్నాను.

తరవాత నేను మా అత్తవారింటికి వెళ్ళగానే, పూజ గదికి తీసుకువెళ్లి నమస్కారం చేసుకోమన్నారు. అక్కడ శ్రీ సాయినాథులవారి పటం వుంది. నాకు సూర్యబింబంలో ఎలా కనిపించారో ఆ విధంగానే వున్నారు ఆ పటంలో! నాకు ఆనందభాష్పాలు వచ్చేసాయి. "నువ్విలాగే నా జీవితాంతం తోడుంటే అంతేచాలు తండ్రీ!" అని నమస్కారం చేసుకున్నాను.

మావారు మా పెళ్ళికి ముందే పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిని, పూజ్యశ్రీ అమ్మగారిని పూజించుకునేవారట. సత్సంగాలకి హాజరయ్యేవారట. మా వివాహానికి ముందు ఒకసారి మావారు సప్తాహ పారాయణ పూర్తి చేసినప్పుడు, పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నంలో, "శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు!" అని దీవించారట. తరవాత నన్ను మావారు ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావన దర్శనానికి, అనంతరం పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి తీసుకువెళ్లారు. తరవాత ఆలోచిస్తే అనిపిస్తుంది, గురుశిష్యులిద్దరూ కలిసి మా వివాహం జరిపించారని!! ●

ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీ జగన్, తెనాలి

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని తెనాలికి చెందిన జగన్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు---

మా తల్లిదండ్రులకు నేను ఏకైక సంతానం. నా వయస్సు 21 సంవత్సరాలు. మా కుటుంబ సమస్యల వల్ల నేను చిన్నప్పుడే చదువు మానేసి ఒక కిరాణా కొట్టులో పనికి చేరాను.

నేను స్కూల్లో చదివేరోజులనుంచి మా అమ్మ, నాన్న నన్ను బయటకు ఎక్కడకీ పంపించేవారు కాదు. ఒక్కసారి మాత్రం నేను 6వ తరగతి చదువుకుంటున్నప్పుడు మా అమ్మని, నాన్నని బ్రతిమాలి నా స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లాను. ఆటలలో చిన్న దెబ్బలాట జరిగి నా తోటివారు నన్ను కొట్టాడానికి తరుముతూంటే, నేను పక్కనున్న పెద్ద ప్రహరీలోకి పరుగెత్తాను. అది శిరిడీ సాయినాథుని మందిరం. అక్కడ బయట దేవుడి పాత్రలు తోముతున్న ఒకావిడ నన్ను తరుముతున్న పిల్లలని కోప్పడి పంపించేసింది. నేను ఒక అరుగుమీద కూర్చుని పాత్రలు తోముతున్న ఆవిడతో, “అన్ని పాత్రలు తోముతున్నారేమ”ని అడిగాను. ఆవిడ, “రేపు గురువారం కదా! బాబా పూజకోసం తోముతున్నాన”ని చెప్పింది. నాకు చాలా జాలివేసి, నేను కూడా తనకు సహాయం చేస్తానని, ఇకనుంచి ప్రతి బుధవారం వచ్చి సహాయం చేస్తానని చెప్పాను. దానికి ఆవిడ చాలా సంతోషించి, “ఇది చాలా గొప్ప సేవ, అలాగే తప్పకుండా చేసుకో!” అని చెప్పారు. అప్పటినుంచి ఆమెకు సహాయం చేయడానికి వెళ్లడం మొదలుపెట్టాను.

కొంచెం పెద్దయ్యాక నేను మా ఊరిలో బి.వి.నరసింహస్వామిగారు ప్రతిష్ఠ చేసిన శిరిడీ సాయిబాబా గుడికి వెళుతుండేవాడిని. నిజానికి అప్పటికి నాకు బాబా గురించి ఏమీ తెలియదు. ఆయన చరిత్ర పారాయణ చేయాలని, భజన చేయాలని... ఇటువంటివేవీ నాకు తెలియవు.

మా ఊరిలో బాబా ప్రచారం చేసే ఒక సత్సంగబృందం బలవంతంమీద ఒక ఉగాది రోజున విజయవాడ దగ్గరున్న ‘పోలయ్యతాత’ దర్శనానికి వెళ్లాను. ఆయన చాలా గొప్పవారని వారు చెప్పారు. మా కుటుంబ సమస్యలు పరిష్కరిస్తారనే ఆశతో దర్శనానికి వెళ్ళాను. తీరా అక్కడకు వెళ్ళాక నా ఆశ నిరాశే అయింది. మేము వెళ్లేసరికి ఆయన రోడ్డుమీద కూర్చుని ఏదో చేస్తున్నారు. పైగా దిగంబరంగా వున్నారు. నాకు ఆయన పిచ్చివారేమోనని అనుమానం వచ్చింది. నిరాశగా తిరిగి వచ్చాను. ఆ రోజు రాత్రి నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను పోలయ్యతాతగారి ఆశ్రమం బయట నిలబడివుంటే తాతగారు నా చెంప మీద ఒక్కటి కొట్టి, చొక్కా కాలర్ పట్టుకుని లోపలకు లాక్కొచ్చి, వారు దివాన్ మీద కూర్చుని, అలా కాలర్ పట్టుకునే నన్ను క్రింద కూర్చోపెట్టి, “నేనంటే ఏమనుకుంటున్నావు? నీ సర్వబాధ్యతలు నావి! నీకు ఋణానుబంధముంది. దానిని అనుభవించాలి. నీకు నేనున్నాను!” అని స్పష్టంగా చెప్పారు. నాకు మెలుకువ వచ్చాక చాలా ఆశ్చర్యమనిపించింది. వారు గొప్పవారని అర్థమైంది. అప్పుడప్పుడూ తాతగారి దగ్గరకు వెళుతుండేవాడిని.

ఒకసారి తాతగారి ఆశ్రమంలో పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి ఫోటో చూశాను. అక్కడివారిని, “ఆయన ఎవరు?” అని అడిగాను. వారు, “శ్రీ సాయి లీలామృతం గ్రంథం వ్రాసినవారు!” అని చెప్పారు. ఆయనొక రచయిత మాత్రమేనని అనుకునేవాడిని. తరవాత కొంతకాలానికి పూజ్యశ్రీ మాస్టరుగారి గురించిన ఒక గ్రంథం నా చేతికి వచ్చింది. అది చదివాక పూజ్యశ్రీ మాస్టరుగారి గొప్పతనం అర్థమై హృదయమంతా ఆయన మీద ప్రేమతో నిండిపోయింది. ఆయనను ఒకసారి దర్శించాలన్న కోరిక తీవ్రంగా కలిగింది. ఆయన సమాధి చెందారని తెలిసి చాలా కృంగిపోయాను. ఇటువంటి మహాత్ములు ఎంతో అదృష్టముంటేనే

కానీ దొరకరనిపించింది. వారి జీవితాశయం కోసం కలెక్టర్ పదవిని త్యాగం చెయ్యడం నన్ను చాలా కదిలించింది. వారిని సేవించుకునేవారితో పరిచయమయితే బాగుండునని తపనపడేవాడిని. అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకరిద్దరితో పరిచయం కల్పించారు. ఆ తరువాత విద్యానగరులోని తపోవనం, గూడలి కొండ, ఒంగోలులోని సమాధి మందిరం దర్శించుకోగలిగాను.

గూడలికొండ దర్శించుకున్న రోజు రాత్రి నా స్వప్నంలో కొండమీద పూజ్యశ్రీ మాస్టరుగారు ధ్యానం చేసుకునే ప్రదేశంలో పోలయ్యతాత పద్మాసనంలో ధ్యానస్థులై పూజ్యశ్రీ మాస్టరుగారు కూర్చున్నట్లే కూర్చుని దర్శనమిచ్చారు. నిజానికి పోలయ్య తాత శరీర తీరుని బట్టి ఆయన పద్మాసనంలో కూర్చోలేరు. పోలయ్యతాతగారికి పూజ్యశ్రీ మాస్టరుగారికి భేదమేలేదన్నమాట అనిపించింది.

నేను నాకున్న సమయంలోనే నెమ్మదిగా పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు చదవడం మొదలుపెట్టాను. శ్రీ సాయి లీలామృతం, శ్రీ గురుచరిత్ర నిత్యపారాయణ చేసుకుంటాను. తత్ఫలితంగా మా ఇంటి పరిస్థితులు కూడా కొద్దిగా మెరుగుపడ్డాయి. నాకు బయటకు వెళ్ళడానికి ఇంట్లో అనుమతినిస్తున్నారు. మా అమ్మ కూడా పారాయణ చేస్తుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు నిత్యం నా మనస్సులో చక్కటి ప్రేరణ కలిగిస్తూ, ఇంట్లో విషమపరిస్థితులు వచ్చినప్పుడల్లా నాకు తట్టుకునే శక్తిని ప్రసాదిస్తున్నారు.

సమస్యలు తట్టుకోలేక నాకు ఇంట్లోంచి ఎక్కడికైనా వెళ్లిపోవాలనిపించినా నేను అలా చేయలేను. ఎందుకంటే పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలలోను, బోధలలోనూ ధర్మానికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చారని, ధర్మం ఆచరిస్తేనే మహాత్ములకు మనం నచ్చుతామని నాకు అర్థమైంది. ఇప్పుడు ఎక్కడికైనా వెళ్లి తప్పించుకుంటే మళ్ళీ ఈ కర్మ తిరిగి అనుభవించవలసివస్తుందని హెచ్చరించారు కదా! కనుక వారిచ్చిన ధైర్యంతో జీవనం సాగిస్తున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారంటే చాలా ఇష్టం. ఆయన మార్గంలో నడవడమంటే వారి రచనలు చదివితే సరిపోదని, వాటిని ఆచరణలో పెట్టడమే సరైన సాధననీ నాకనిపిస్తుంది. అంతేకాకుండా పూజ్యశ్రీ అమ్మగారు ఒక సత్సంగంలో అన్నిటికంటే ఆత్మవిమర్శ సరైనదని, మనలోపల మనం కాగడా పెట్టి మన తప్పులని వెతుక్కోవాలని చెప్తారు. అది నాకు చాలా నచ్చింది. అయ్యకు అమ్మ సరిసాటి అనిపించింది.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి దయవల్ల చీరాలస్వామి, చివటంఅమ్మ మొదలైన మహాత్ముల సమాధుల దర్శనం చేసుకోగలిగాను. అక్కడ విశేషమైన అనుగ్రహం కూడా లభించింది. క్రిందటి నెలలో సెప్టెంబర్ 3న చీరాలస్వామి ఆరాధనకు వెళ్ళినప్పుడు అక్కడ కమిటీవారిని, “స్వామివారి గుర్తుగా సమాధిమీద కప్పిన వస్త్రంలో చిన్నముక్క ఏమైనా ప్రసాదంగా ఇస్తారా?” అని అడిగాను. వెంటనే వారు, “చిన్న ముక్క ఎందుకు? ఎప్పటినుంచో స్వామికి చాలాసార్లు అలంకరించిన వస్త్రాలు వున్నాయి. అవి నువ్వు తీసుకో బాబూ!” అని ఒక పంచె కండువా మొత్తం నాకు ప్రసాదంగా ఇచ్చారు.

అలాగే చివటం వెళితే అక్కడ వున్న లక్ష్మక్కగారు నన్ను తీసుకుని, అమ్మ సశరీరంగా వున్నప్పుడు భిక్షకు వెళ్లే అందరి ఇళ్లనుంచి అమ్మ తినే భిక్ష పాత్రలో భిక్షని సేకరించి, అమ్మకి నివేదించి, ‘ఈ ప్రసాదం మొత్తం నువ్వే తినాల’ని నాకు ఇచ్చారు!

ఒకసారి వేల్పూరులో రమణాశ్రమానికి వెళ్లినప్పుడు, అక్కడ గోడకు వున్న రమణ మహర్షి చిత్రపటం నన్ను బాగా ఆకర్షించింది. ‘అలాంటి చిత్రపటం ఒకటి తీసుకుని ఫ్రేమ్ కట్టించుకుంటే బాగుంటుంది!’ అనిపించింది. అంతలోనే అక్కడవుండే మౌన స్వామిగారు వచ్చి నన్ను చూసి ఎదురుగా వున్న బీరువాలోనుంచి నేను కావాలనుకున్న ఫోటోలాంటిదే ఫ్రేమ్ కట్టివున్నది తీసి నా చేతిలో పెట్టి లోపలకు వెళ్లిపోయారు!!

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి చెప్పుకుని మహాత్ముల దర్శనానికి వెళితే ఆ వైభవం ఎలా వుంటుందో చాలామంది అనుభవాలలో తెలుసుకున్నాము. అలాంటివి నాకు కూడా ప్రసాదించినందుకు ఆ సద్గురుమూర్తికి కృతజ్ఞతలు.

పూజ్యశ్రీ మాస్టరుగారు నా జీవితంలో ప్రవేశించాక నాకు ఒక స్పష్టమైన మార్గం దొరికింది. నేను ఇప్పుడు ఎక్కడికీ పరుగులు పెట్టడం లేదు. వారు సూచించిన పారాయణలు చేసుకుంటూ, వారు చెప్పిన మార్గంలో నడవడానికి ప్రయత్నం చేస్తున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లు ఆయన ఒక మహాసముద్రం. నాలాంటివారికి ఆయన గురించి ఒక బిందువంత కూడా తెలియదు. ఏమాత్రం ఈ సంప్రదాయం

తెలియని కుటుంబంలో జన్మించిన నన్ను అక్కున చేర్చుకుని, కష్టాలలో కొట్టుకునిపోతున్న నాకు అండగా నిలిచి నడిపిస్తున్న నా దైవం పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి అనంతకోటి కృతజ్ఞతాపూర్వక పాదాభివందనాలు తెలియచేసుకుంటున్నాను.

ఓం సన్మార్గ దర్శకాయ నమః!

''మామిడి పూతంతా పండ్లవుతాయా?''

03వ పేజీ తరువాయి

ఆత్మవంచనకో, పరవంచనకో సాహసించలేనివారు సంసారులుగా వుంటూనే గురుదేవులన్పించుకో జూస్తారు. అందుకే క్రీస్తు అన్నారు – "Many are called but only a few are chosen" – "ఎందరో (సన్మార్గానికి) ఆకర్షించబడతారు కాని వారిలో (భగవంతునిచేత) ఆమోదించబడేవారు ఏ కొద్దిమందో!" అని. అదే విషయం సాయి "మామిడి చెట్టు మీది పూతంతా పండ్లవుతాయా? పూతగాను, పిందెలుగానూ ఎక్కువ భాగం రాలిపోతాయి. చివరిదాకా నిలిచియుండి పండ్లయ్యేవి ఏ కొద్దో!" అని చెప్పారు. మానవులలో ఎందరో సాధన ప్రారంభిస్తే, వారిలో ఏ కొద్దిమందో తీవ్రమైన తపస్సు, యజ్ఞయాగాలు పట్టుదలతో చేయగల్గుతారు. కాని వీరిలో కొందరు భస్మాసురుడు, రావణాసురులలాగ రాక్షసులవుతారు; కొందరు ఇంద్రాది దేవతలవుతారు. మిగిలిన వారిలోగూడ కొందరు విశ్వామిత్రునిలా చిరకాల తపస్సు తర్వాత గూడ 'కామ-కాంచనాలకు' దాసులై పతనమవుతూంటారు. ఏ కొద్దిమందో ఆయనలా చివరకు బ్రహ్మజ్ఞానులవుతారు. శ్రీకృష్ణుడి కాలమైన ద్వాపరయుగంలోనే ముముక్షువులంత కొద్దిమంది వుంటే, యిక కలియుగమైన మనకాలంలో సంగతి చెప్పవలసిన దేమున్నది? ఈ యుగంలో ఆత్మజ్ఞానం లేకనే గురువులై శిష్యసేకరణ చేసేవారే ఎక్కువన్నది ఋషులనిర్ణయం. అందుకే సాయిబాబా గూడ "నిజమైన ఫకీర్లు చాలా అరుదు" అన్నారు. 'ఫకీరు' అంటే వారి పరిభాషలో 'గురువు' అని అర్థం. తమ గురువు గురించి ఆయనెప్పుడూ అలానే అనేవారని మరువగూడదు.

ఇంత బీభత్సానికీ కారణం సంగమే! అందుకే భగవద్గీత 15వ అధ్యాయంలో పురుషోత్తమప్రాప్తికి మార్గం "అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్త్వా" – అంటే "సంగరాహిత్యమనే ఆయుధంతో సంగం వలన నానాటికీ విజృంభిస్తూంటే సంసార వృక్షాన్ని ఛేదించాలి" అని చెప్పాడు. అయితే మనకొచ్చిన సమస్య మనవద్ద యీ అసంగమనే శస్త్రం లేకపోవడమే! అది మనం సిద్ధం చేసుకొంటేగా? దానినెలా సిద్ధం చేసుకోవాలి?

మాతృదేవి స్మృతులు

12వ పేజీ తరువాయి

అపాయం లేదని చెప్పారు, అది బీచ్ కి వెళ్ళినప్పుడు అక్కడి వాటర్ వల్ల వచ్చిన infection అని చెప్పారు" అన్నాడు. పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకుని ఊపిరి పీల్చుకున్నాను.

రెండు రోజుల తర్వాత మా అబ్బాయి కొంత డబ్బు నాకు పంపించాడు. నేను ఫోన్ చేసి, ఇప్పుడెందుకు పంపించావని అడిగాను. "ఏమో నమ్మా, పంపించాలనిపించింది, అంతే!" అన్నాడు. మర్నాడు పూజ్యశ్రీ అమ్మగారు నన్ను పిలిచి, ఒక వస్తువు పేరు చెప్పి అది తీసుకువచ్చి యిమ్మన్నారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే, దాదాపు ఒక సంవత్సర కాలంగా పూజ్యశ్రీ అమ్మగారు నా దగ్గరనించి ఏమీ స్వీకరించటం లేదు. "ఆహా! ఏమి నా భాగ్యము!" అనుకొని, వెంటనే తెచ్చి పూజ్యశ్రీ అమ్మగారికి సమర్పించుకొన్నాను. ఆశ్చర్యమేమిటంటే, నేను తెచ్చిన వస్తువు సరిగ్గా మా అబ్బాయి పంపించిన అమౌంట్ కి సరిపోయింది! అప్పుడు నాకు అర్థం అయ్యింది, వాడికి వచ్చిన రోగాన్ని పూజ్యశ్రీ అమ్మగారే తగ్గించారు కనక, వాడి దగ్గరనించే దక్షిణ తీసుకున్నారని!!

ఆ తల్లి నమ్మినవారినే కాక, నమ్మని వాళ్ళని కూడా రక్షించే కరుణామయి! ఇప్పటికీ ఎన్నో ఒడిదుడుకులతో కొనసాగుతున్న నా జీవితాన్ని, సహస్రాక్షాలతో కనిపెట్టి కాపాడుతున్న ఆ ప్రేమమూర్తికి, సహస్రకోటి ప్రణామములు అర్పిస్తూ, జన్మ జన్మలకు తోడు వుండమని ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,
Hyderabad-68. Phone: +91 - 74160 41550
Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 08592233271
Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", Payable at Hyderabad or Ongole.

BOOKS CLASSIFICATION

1. BOOKS ON SHRI GURU DATTA

శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

- శ్రీ గురు చరిత్ర + శ్రీ సాయి లీలామృతము (బౌండ్) 499-00
- శ్రీ గురు చరిత్ర 199-00
- శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి 149-00
- శ్రీ దత్తావతార మహత్యము 75-00

2. BOOKS ON SRI SAI BABA

షిరిడీ సాయిబాబా పై విరచితమైన శ్రీ షిరిడి గ్రంథములు

- శ్రీ సాయి లీలామృతము 199-00
- శ్రీ సాయి సన్నిధి 199-00
- శ్రీ సాయి ప్రబోధామృతము 119-00
- శ్రీ సాయినాథ పూజ 49-00
- షిరిడీ హారతులు 15-00
- శిరిడీ క్షేత్ర సందర్శనము 49-00
- సాయినాథ స్తవన మంజరి 10-00
- సాయిని పూజించడం ఎందుకు? 10-00
- సాయి సూక్తి ఆచార్యవాణి 20-00
- శ్రీ సాయి నిత్య సత్య వ్రతము 20-00

3. BOOKS ON MAHATMAS

ఇతర మహాత్ముల గ్రంథములు

- శ్రీ అక్కల్ కోట స్వామి 75-00
- శ్రీ తాజుద్దీన్ బాబా 75-00
- శ్రీ అవధూత వెంకయ్య స్వామి 99-00
- అవధూత శ్రీ చీరాల స్వామి 75-00
- శ్రీ పాకలపాటి గురువుగారు 75-00
- శ్రీ ఆనందమయి అమ్మ 75-00
- శ్రీ గురు సిద్ధారూడ స్వామి 99-00
- శ్రీ అవధూత చివటం అమ్మ 99-00
- టిబెట్ యోగి మిలారేపా చరిత్ర 99-00

4. BOOKS ON ANVESHANA & SCIENCE & RELIGION

అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

- ఏది నిజం 49-00
- మతం ఎందుకు 49-00
- విజ్ఞాన వీచికలు 99-00

5. BOOKS ON MEDITATION

ధ్యాన సంబంధమైన గ్రంథములు

- ధ్యానయోగ సర్వస్వము 75-00
- బుద్ధ ధ్యాన హృదయము 49-00

6. BOOKS ON SPIRITUALITY & TATVA CHINTANA

ఆధ్యాత్మికత తత్వచింతన పూర్వ గ్రంథములు

- సాయి మాస్టర్ ప్రవచనములు 199-00
- ఆధ్యాత్మిక జాగృతి 199-00

7. BOOKS ON PUJYA ACHARYA E.BHARADWAJA

పూజ్య భరద్వాజ గురుదేవుల పై విరచితమైన గ్రంథములు

- మహాత్ముల ముద్దుబిడ్డడు 149-00
- భగవాన్ శ్రీ భరద్వాజ 299-00
- మహా పురుషుడు 60-00
- సాయి మాస్టర్ స్మృతులు -1 199-00
- సాయి మాస్టర్ స్మృతులు -2 199-00
- ఆచార్య అమృత లేఖావళి 199-00
- మరో నంద దీపం 120-00
- మాస్టారు అమృత వాక్కులు 99-00

8. BOOKS FOR CHILDREN

బాలల కొరకు విరచితమైన గ్రంథములు

- బాలల సాయి లీలామృతము 49-00
- బాలల సాయిసన్నిధి 75-00
- బాలల శ్రీ గురు చరిత్ర 75-00

9. BOOKS IN ENGLISH

ఆంగ్లంలో విరచితమైన గ్రంథములు

- SAI BABA THE MASTER 249-00
- SHRI GURU CHARITRA 149-00
- SUPREME MASTER 149-00
- TAJUDDIN BABA 149-00
- SAI BABA AND HIS TEACHINGS 149-00
- CHILDREN'S SAI BABA THE MASTER 80-00

10. BOOKS IN OTHER LANGUAGES

ఇతర భాషలో విరచితమైన గ్రంథములు

- सद्गुरु श्री साई बाबा श्रीगुरुच 249-00
- కన్నడ సాయి లీలామృతం 249-00
- కన్నడ ప్రబోధామృతము 149-00
- కన్నడ గురు చరిత్ర 199-00
- కన్నడ సాయి సన్నిధి 249-00
- ఒరియా సాయి సన్నిధి 249-00
- కన్నడ మిలారెపా చరిత్ర 119-00
- కన్నడ స్వామి సమర్థ 119-00
- తమిళ్ సాయి లీలామృతము 249-00
- తమిళ్ షిరిడీ హారతులు 29-00
- తమిళ్ స్తవన మంజరి 20-00
- తమిళ్ శ్రీ గురుచరిత్ర 299-00
- మలయాళ సాయి లీలామృతం 299-00
- మలయాళం గురు చరిత్ర 299-00

11. OTHER BOOKS

ఇతర గ్రంథములు

- సత్సంగము భజన 10-00
- పురుష సూక్త రహస్యము 49-00
- మనము మన సంస్కృతి 75-00

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనోత్సవము తిథుల ప్రకారం మే 13, 2023 న మరియు ఆంగ్ల కాలమాన ప్రకారం జూన్ 3, 2023 న గుమ్మళంపాడు మాతృదేవి దివ్య సన్నిధిలో జరుగును. ఉత్సవాలకు సంబంధించి మరిన్ని వివరములకు శ్రీ పి.రమేష్ గారిని (9440018038), శ్రీ టి.వి.రావుగారిని (9063334964) సంప్రదించగలరు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ 34వ ఆరాధనా మహోత్సవము ఏప్రిల్ 12, 2023న,
ఒంగోలు సమీపంలోని సంత నూతలపాడు మండలం, గుమ్మళంపాడు గ్రామ శివారులో గల
శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానములో వైభవంగా జరిగింది.

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.